

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 25-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:71 పేజీలు:4 వెల: రూ.1/-

## ప్రజలకు సిఎం కెసిఆర్ సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

### మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కవిత అభినందనలు

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలకు సిఎం కెసిఆర్ సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పండగ వేళ ఆనందోత్సాహాలతో గడపాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పండగ బతుమ్మ అన్నారు. సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన వారిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నారు. ఆడబిడ్డలను ఇంటికి పిలిచి కానుకలు ఇవ్వడం ఈ పండుగ ఆచార సంప్రదాయమని మంత్రులు పేర్కొన్నారు. బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకునే పండుగలు సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు అని తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి దృష్ట్యా మాస్కులు ధరిస్తూ,భౌతిక దూరం పాటిస్తూ ఈ పండుగలని జరుపుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం వీడియోను విడుదల చేశారు. ప్రతీ సంవత్సరం బతుకమ్మ పండుగ అంటేనే ఎంతో సందడిగా ఉంటుందని, అయితే ప్రస్తుతం కరోనా మహమ్మారి కారణంగా ఎవరింట్లో వాళ్లు, మాస్కులు పెట్టుకుని పండుగను జరుపుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. 'ఇలాంటి పరిస్థితులలో కూడా ఆడబిడ్డలంతా ఉత్సాహంగా బతుకమ్మ పాటలు నెమరువేసుకుంటూ, యూట్యూబ్‌లో బతుకమ్మ కొత్త పాటలు వింటూ, పెద్దఎత్తున పండుగను జరుపుకుంటున్నట్టు సోషల్ మీడియాలో చూస్తున్నాం' అంటూ హర్షం వ్యక్తం చేశారు. ఓ పక్క కరోనా, మరోపక్క హైదరాబాద్‌లో అకాల వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనమందరం ఒకరికొకరు అండగా నిలుస్తూ, బతుకమ్మ పండుగను పరిపూర్ణం చేసుకోవాల్సిన సందర్భం వచ్చిందన్నారు. వరదల కారణంగా నష్టపోయిన వారందరినీ ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ తక్షణ సాయంగా రూ.550 కోట్లను విడుదల చేయడం సంతోషదాయకం అన్నారు. హైదరాబాద్ ప్రజల ఇబ్బందులు త్వరగా తొలగిపోవాలని, గౌరమ్మ తల్లి దయతో కరోనా కనుమరుగవ్వాలని ఎమ్మెల్సీ కవిత ప్రార్థించారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## సైబర్ మోసాలకు పాల్పడుతున్న 18మంది అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా ఓఎల్ఎక్స్‌లో వరుస మోసాలకు గురి చేస్తున్న 18 మందిని పోలీసులు మీడియా ఎదుట హాజరు పరిచారు. సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఓఎల్ఎక్స్‌లో మోసాలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన 18మందితో కూడిన ముఠాను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ముఠా గతంలో బంగారం దొంగతనాలకు పాల్పడేదని తెలిపారు. ప్రస్తుతం టెక్నాలజీని వాడుకుంటూ ఓఎల్ఎక్స్‌లో సైబర్ నేరాలకు పాల్పడుతోందని చెప్పారు. ఇటీవల ఓఎల్ఎక్స్‌లో మోసాలు భారీగా పెరగడంతో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా పోలీసుల సహాయంతో నిందితుల స్వగ్రామాలకు వెళ్లి పది మందిని అరెస్టు చేశామని, అప్పటికే అక్కడి పోలీసులు అరెస్టు చేసిన ఎనిమిది మందిని ఇక్కడికి తరలించినట్లు పేర్కొన్నారు. ముఠాపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. ఇకపై సైబర్ నేరాలకు పాల్పడకుండా ప్రత్యేక నిఘా పెడుతామని చెప్పారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కిసాన్ సూర్యోదయ యోజనకు రూ.3,500 కోట్ల బడ్జెట్

### గుజరాత్‌లో మరో మూడు పథకాలను ప్రారంభించిన ప్రధాని మోదీ

గాంధీనగర్, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): గుజరాత్ ప్రజల కోసం మరో మూడు పథకాలను ప్రారంభించిన ప్రధాని మోది. రైతుల కోసం కిసాన్ సూర్యోదయ యోజనను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. కిసాన్ సూర్యోదయ యోజన్ పథకాన్ని గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఇటీవల ఆమోదించారు. దీని ద్వారా రైతులకు ఉదయం సమయంలో విద్యుత్‌ను అందించవచ్చని తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ విద్యుత్‌ను అందించనున్నట్లు తెలిపారు. దీనిని ప్రారంభించేందుకు రూ.3,500 కోట్లను బడ్జెట్‌గా అనుమతించారు. ఈ పథకం 2023నాటికి పూర్తి అవుతోందని తెలిపారు. అయితే ప్రధాని మోదీ దీనితో పాటు ఆరోగ్య సంబంధిత పథకాన్నీ ప్రవేశపెట్టారు. గుండె సంబంధిత ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం సన్నిద్ధం కానుందని తెలిపారు.

అయితే పీడియాట్రిక్ హార్ట్ ఆసుపత్రిని యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో కలిసి నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో టెలీ కార్డియాలజీను ఉపయోగించేందుకు అనువుగా ఓ మొబైల్ యాప్‌ను నిర్మించేందకు చూస్తున్నారు. అయితే ప్రస్తుతం యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ మరింత పెద్దది చేసేందుకు చూస్తున్నారు. దానికి గానూ రూ.470 కోట్ల బడ్జెట్‌ను వేసినట్లు సమాచారం. ఇది పూర్తి అయితే ఇందులోని పడకల సంఖ్య 450 నుంచి 1251కి పెరుగుంది. దీంతో దేశంలో అతిపెద్ద ఇన్‌స్టిట్యూట్‌గా ఇది నిలుస్తుందని, అదేవిధంగా ప్రపంచంలో అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ల జాబితాలో స్థానం సంపాదిస్తుంది.

వీటితో పాటు గిర్‌నార్ రోప్‌వేను కూడా అమలు చేయనున్నట్లు సమాచారం. గుజరాత్‌లోని గిర్‌నార్ కొండ ఎక్కేందుకు రోప్‌వే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అయితే దీని ద్వారా ఏడున్నర నిమిషాల్లో 2 కిలోమీటర్ల దూరం వరకూ ప్రయాణించవచ్చని అన్నారు. అంతేకాకుండా 25 నుంచి 30 వరకూ క్యాబిన్స్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతి క్యాబిన్ 8 మంది కెపాసిటీతో ఉండేలా కట్టించనున్నట్లు చెప్పారు. ఈ రోప్‌వే మార్గం ద్వారా అందమైన సీనరీలు కూడా ఆస్వాదించ వచ్చని, కొండ చుట్టూ ఉండే పచ్చదనం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని చెప్పారు. అయితే ఈ సమావేశానికి గుజరాత్ సీఎం, ఇతర మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## దేశంలో విజృంభిస్తున్న కరోనా

### 78 లక్షల మార్క్ దాటిన కరోనా కేసులు
### తాజాగా 53,370 కరోనా పాజిటివ్ కేసులు

న్యూ డిల్లీ, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): దేశంలో కరోనా విజృంభిస్తునే వుంది. తాజా కేసులతో దేశంలో 78 లక్షలు దాటాయి కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య. గడచిన 24 గంటలలో 53,370 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా.కరోనా వల్ల మొత్తం 650 మంది మృతి చెందారు. ఇక గడచిన 24 గంటలలో దేశ వ్యాప్తంగా 67,549డిశ్చార్జ్ అయ్యారు. దేశంలో ఇప్పటివరకు నమోదయిన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 78,14,682 కాగా ..దేశ వ్యాప్తంగా యాక్టీవ్ కేసులు 6,80,680 గా ఉన్నాయి. ఇక కరోనా కు చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన వారి సంఖ్య 70,16,046 కి చేరింది. "కరోనా" వల్ల దేశంలో మొత్తం మృతి చెందిన వారి సంఖ్య 1,17,956 నమోదైంది. ఇటు దేశంలో కరోనా రోగుల రికవరీ రేటు 89.78శాతంగా ఉండగా. దేశంలో నమోదయిన మొత్తం కేసులలో "యాక్టివ్" కేసులు 8.71శాతంగా ఉంది. దేశంలో మొత్తం నమోదయిన కేసులలో 1.51 శాతానికి మరణాల రేటు తగ్గింది. ఇటు గడచిన 24 గంటలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన "కరోనా" టెస్ట్ ల సంఖ్య 12,69,479కు చేరింది.

## రైతు బజార్ల ద్వారా 35కే కిలో ఉల్లి

### -మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఉల్లి ధరల నియంత్రణ కోసం మార్కెటింగ్ శాఖ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో రూ. 35కే కిలో ఉల్లిగడ్డలు విక్రయిస్తున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నుంచేరైతుబజార్లలో ఉల్లి విక్రయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జంట నగరాల్లోని 11 రైతుబజార్లలో ఉల్లిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి వ్యక్తికి రెండు కిలోల చొప్పున ఉల్లిని విక్రయిస్తామన్నారు. ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఉల్లిని కొనుగోలు చేయొచ్చు అని తెలిపారు. భారీ వర్షాలకు దేశ వ్యాప్తంగా ఉల్లి పంట దెబ్బతిన్నదని చెప్పారు. లాభం లేకుండా రవాణా ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అమ్మకాలు జరుపుతున్నామని పేర్కొన్నారు. ఉల్లి ధర ఘాటెక్కిస్తోంది. రూ.40 నుంచి మొదలైన ఉల్లి ధర పెంపు రెండు నెలల వ్యవధిలోనే రూ.100కు చేరింది. రైతుబజార్లలో కిలో రూ.75కు విక్రయిస్తుండగా, బయటి మార్కెట్లో మాత్రం వంద రూపాయలు పలుకుతోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మహారాష్ట్ర, కర్ణాటకలతోపాటు కర్నూలులోని పంట మొత్తం నాశనమైపోయింది. ఈ తరుణంలో రైతు బజార్లలో తక్కువ రేట్లకే అమ్మేలా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఏపీలో తక్కువ రేటుకే ఉల్లిపాయలు విక్రయిస్తున్నారు. తాజాగా.. హైదరాబాద్‌లోని రైతు బజార్లలో రూ.35 కే కిలో ఉల్లిగడ్డలు విక్రయించనున్నారు. ఉల్లిధరల నియంత్రణ కోసం మార్కెటింగ్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. జంట నగరాల్లోని 11 రైతుబజార్లలో ఇది అందుబాటులోకి రానుంది. ప్రతి వ్యక్తికి రెండు కిలోల చొప్పున విక్రయిస్తారు. ఏదైనా గుర్తింపుకార్డు చూపించడం తప్పనిసరి చేశారు. భారీ వర్షాలకు దేశవ్యాప్తంగా ఉల్లిపంట దెబ్బతిన్నది. ఎలాంటి లాభం లేకుండా రవాణా ఖర్చులు, దెబ్బతిన్న సరుకును దృష్టిలో ఉంచుకుని అమ్మకాలు జరపాలని మార్కెటింగ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశించారు.

## ఉత్తరార్ధగోళంలో క్లిష్టమైన దశ

### కొన్ని దేశాలు ప్రమాదం బారిన పడే అవకాశం
### క్లిష్టమైన దశలో కోవిడ్ మహమ్మారి
### మరింత ప్రాణ నష్టం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి
### ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ హెచ్చరిక
### డేంజర్ జోన్‌లోకి యూఎస్ ...

న్యూ డిల్లీ, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): కరోనా మహమ్మారి మళ్లీ తీవ్రంగా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచంలో ఇప్పుడు కోవిడ్ మహమ్మారి క్లిష్టమైన దశలో ఉందని, కొన్ని దేశాలు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ హెచ్చరించారు. ఉత్తారార్ధగోళంలో క్లిష్టమైన దశలో ఉన్నామని.. ఇప్పటికే ఆస్పత్రుల్లో కరోనాతో జనాలు నిండిపోయారని చెబుతున్నారు. ఇంకా అక్టోబర్‌లోనే ఉన్నామని, రాబోయే కొద్ది నెలలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. కరోనా కారణంగా మరింత ప్రాణ నష్టం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే ఆరోగ్య సేవలు కూలిపోకుండా, విద్యాసంస్థలు మళ్లీ మూసివేయాల్సిందిగా ఆయా దేశాల నేతలను కోరారు. మహమ్మారి కట్టడికి ఆయా దేశాలు విచక్షణాయుతంగా చర్యలు తీసుకోవాలని ఫిబ్రవరిలో చెప్పానని, మరోసారి గుర్తు చేస్తున్నానని అన్నారు. చాలా దేశాల్లో అంటు వ్యాధులు పెరిగే అవకాశాలున్నాయని, వైరస్ వ్యాప్తిని త్వరగా అరికట్టేందుకు ఆయా దేశాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం వంటివి పాటిస్తే కరోనా నుంచి గట్టెక్కవచ్చని.. కోవిడ్ పరీక్షల పెరుగుదల, కాంటాక్ట్ ట్రేసింగ్, ఐసోలేషన్ నిబంధనలను పాటించడం వల్ల ఆయా దేశాలు గట్టెక్కవచ్చని ఆయన సూచించారు.

దుమ్ము రూపంలో కరోనా ప్రజల దగ్గరకు వస్తోందని.. జాగ్రత్తగా ఉండాలని ఉత్తర కొరియా సూచిస్తోంది. పసుపు రంగు దుమ్ములో కరోనా వైరస్ ఉండే అవకాశం ఉందని, అందుకే ప్రజలు ఎవరూ బయటకు రావద్దని దేశ టీవీల్లో ఎల్లో డస్ట్ గురించి హెచ్చరికలు చేశారు. చైనా మీదుగా వీచే దుమ్ము, ధూళిలో విషపూరిత పదార్థాలు, వైరస్, సూక్ష్మక్రిములు ఉండే అవకాశాలు ఉన్నట్లు ఉత్తర కొరియా తమ ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ వార్నింగ్ వచ్చిన వెంటనే గురువారం రాజధాని ప్యోంగ్‌యాంగ్ వీధులన్నీ ఖాళీ అయ్యాయి. కరోనా వైరస్ కేసులు లేకుండా చేయడానికి ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఎన్నో చర్యలు తీసుకున్నారు. సరిహద్దుల్ని కూడా మూసివేసి.. అనేక ఆంక్షలను అమలు చేస్తున్నారు.

యూఎస్ లో అలెర్ట్

కరుణ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తోంది. కరోనా తీవ్ర ప్రభావానికి గురైన దేశాలలో అగ్రస్థానంలో నిలిచింది అగ్రదేశం అమెరికా. యునైటెడ్ స్టేట్స్ లో 2021 ఫిబ్రవరి చివరినాటికి కరోనా వైరస్ కారణంగా ఒకటిన్నర లక్షలకు పైగా ప్రజలు చనిపోవచ్చని అంచనా వేస్తోంది వాషింగ్టన్ విశ్వవిద్యాలయ ఇన్స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవల్యూషన్. అయితే ప్రతి ఒక్కరూ మాస్కులు ధరిస్తే మాత్రం ఒక లక్ష 30 వేలకు పైగా ప్రాణాలను కాపాడవచ్చు అని అధ్యయనం వెల్లడించింది.కరోనా వైరస్ చికిత్స పెద్ద ప్రభావవంతంగా పనిచేయకపోవడంతో పాటు, వ్యాక్సిన్ కూడా అందుబాటులోకి రాని కారణంగా యూఎస్ లో కరోనా వైరస్ దారుణ స్థితిని సృష్టించింది. ప్రపంచంలోనే కరోనా కారణంగా దెబ్బతిన్న దేశాలలో మొదటి స్థానంలో నిలిచింది యూఎస్. ఇక ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్ శీతాకాలపు సమస్యలు ఎదుర్కొంటుంది. శీతాకాలం లో కరోనా వైరస్ విజృంభించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జాగ్రత్త వహించాలి అంటూ ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యూయేషన్ డైరెక్టర్ క్రిస్ ముర్రే ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుత శీతాకాలం సమీపిస్తున్న వేళ డేంజర్ జోన్ లోకి వెళ్తున్నాము అంటూ పేర్కొన్న ఆయన దేశం ఇప్పుడు కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కొంటోందని క్రిస్ ముర్రే తెలిపారు. దేశంలో తాజా పరిస్థితి కరోనా మహమ్మారి పూర్తిస్థాయిలో తగ్గిపోతుంది అనడానికి ఎలాంటి నమ్మకాన్ని కలిగించడం లేదని ఆయన పేర్కొన్నారు. కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా వంటి జనాభా అత్యధికంగా కలిగిన రాష్ట్రాలలో ముఖ్యంగా అధిక స్థాయిలో కరోనా కేసులు, మరణాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. దీంతో అక్కడ ఆసుపత్రులు మౌలిక వనరుల డిమాండును ఎదుర్కొంటున్నారని అధ్యయనంలో అంచనా వేశారు.

డిసెంబర్ చివరిలో మరియు జనవరిలో రోజు వారి మరణాల స్థాయి పెరుగుతుందని ముర్రే పేర్కొన్నారు. అయితే ప్రజలందరూ మాస్కులు ధరించడం ద్వారా మరణాల రేటు తగ్గించే అవకాశం ఉందని ఆయన అన్నారు. తాజా కరోనావైరస్ ప్రభావాన్ని బట్టి, వ్యాప్తిని బట్టి ఫిబ్రవరి 1 నాటికి 386,000 మరణాలను నమోదు చేసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మాస్కుల వాడకాన్ని విస్తరించడమే యునైటెడ్ స్టేట్స్ కు మేలు చేకూరుస్తుందని పేర్కొన్నారు.

ఐరోపా లోని కొన్ని ప్రాంతాలతో పాటు, కరోనా వైరస్ అత్యధికంగా ప్రభావం చూపిస్తున్న ఇతర ప్రాంతాలు ఇప్పుడు శీతాకాల కరోనా సమస్యలను అరికట్టడానికి సామాజిక దూరాన్ని పాటించడంతో పాటుగా, మాస్క్ లను ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మాస్క్ ల వాడకం కోసం పలు రాష్ట్రాలలో కఠిన నిబంధనలను విధిస్తున్నారు. అయితే యూఎస్ లో మాస్కులు ఇప్పుడు రాజకీయ దుమారానికి కారణమవుతోంది. యూఎస్ ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ తరచుగా మాస్కులు లేకుండా కనిపించడంతో ప్రతిపక్ష పార్టీలకు అది ప్రధాన ఆయుధంగా మారింది.

## రుణ గ్రహీతలకు ఊరట

### చక్రవడ్డీ మాఫీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్
### మార్గదర్శకాలు విడుదల చేసిన ఆర్థిక శాఖ

న్యూ డిల్లీ, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): రుణ గ్రహీతలకు ఊరట కల్పిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మారటోరియం కాలానికి రూ.2 కోట్ల వరకు ఉన్న రుణాలపై చక్రవడ్డీ మాఫీ చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను వెలువరించింది. వీలైనంత త్వరగా చక్రవడ్డీ అంశంపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో కేంద్రం తాజా మార్గదర్శకాలు విడుదల చేయడం గమనార్హం. వడ్డీ మాఫీ వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.6,500 కోట్ల మేర భారం పడనుంది.

కేంద్రం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారం.. గృహ రుణాలు, విద్య, వాహన, ఎంఎస్ఎంఈ, వినియోగ వస్తువుల కొనుగోలు రుణాలు, వినియోగ రుణాలు వంటివి ఈ స్కీమ్ పరిధిలోకి వస్తాయి. ఈ రుణం వర్తించాలంటే ఫిబ్రవరి 29 నాటికి సదరు ఖాతా ఎన్‌పీఏగా గుర్తించి ఉండకూడదని కేంద్రం తన మార్గదర్శకాల్లో స్పష్టంచేసింది. సాధారణ వడ్డీకి, చక్రవడ్డీకి ఉన్న తేడాను రుణ విక్రేతలు (బ్యాంకులు, ఆర్థిక సంస్థలు) రుణ గ్రహీతల ఖాతాల్లో జమ చేయాలని కేంద్రం పేర్కొంది. ఆ మొత్తాన్ని కేంద్రం రీయింబర్స్ చేస్తుందని తెలిపింది. మార్చి 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రకటించిన మారటోరియం కాలానికి ఈ స్కీమ్ వర్తిస్తుందని కేంద్రం స్పష్టంచేసింది. మారటోరియం ఉపయోగించుకోని వారికి కూడా ఈ స్కీమ్ వర్తిస్తుంది. అక్టోబర్ 14న ఈ అంశంపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. వీలైనంత త్వరగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని, సామాన్యుడి దీపావళి కేంద్రం చేతిలో ఉందంటూ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను నవంబర్ 2కు వాయిదా వేసింది.

## ఉత్తరప్రదేశ్‌లో మరో అత్యాచార ఘటన

### యువతికి సెక్సువల్ వేధింపులు..
### ప్రతిఘటించడంతో తుపాకితో కాల్చి చంపిన కిరాతకులు

ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): హత్రాస్ రేప్ కేసు నిందితులకు కఠిన శిక్ష విధించాలని దేశం మొత్తం డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్‌లో మాత్రం మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. రాష్ట్రంలో ఏదో ఓ చోట వారిపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఓ 16 ఏళ్ల యువతిని సెక్సువల్ వేధించిన ముగ్గురు వ్యక్తులు.. తమ మాట వినకపోవడంతో ఆమెను గన్‌తో కాల్చి చంపారు. యూపీ ఫిరోజాబాద్ జిల్లాలోని బాధితురాలు ఇంటి వద్దే ఈ ఘటన చోటుచేసుకుంది.

ఈ ఘటనతో బాలిక కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించి బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. బాధితురాలి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జిల్లా ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై బాలిక తండ్రి మాట్లాడుతూ.. "కొందరు యువకులు మా ఇంటికి వచ్చి గొడవకు దిగారు. తుపాకితో నా కూతురి తలపై కాల్చారు. మనీష్ యాదవ్, శివ్‌పాల్ యాదవ్, గౌరవ్ చాక్ నా కూతురిని చంపారు. నా కూతురు ఇప్పుడు 12వ తరగతి చదువుతుంది. రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చేటప్పుడు వీళ్లు అసభ్య పదజాలంతో వేధించేవారు. నా కూతురు వీరి వేధింపులను ప్రతిఘటించింది. ఇంటికి వచ్చి నా కూతురిపై సెక్సువల్‌గా దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీనిని వ్యతిరేకించడంతోనే కాల్చి చంపారు"అని చెప్పాడు.

నిందితులను పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎస్ఎస్‌పీ సాయిచంద్ పటేల్ తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందడంతోనే పోలీసులు అక్కడికి చేరుకున్నారని చెప్పారు. బాధితురాలి తండ్రి ముగ్గురి పేర్లు చెప్పాడు.. వారు ఇంట్లోకి ప్రవేశించి ఆమెను చంపినట్టు పోలీసులకు వివరించాడని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని అన్నారు.

## కిసాన్ సమ్మాన్ నిధి 5000లకు పెంచే యోచన

### రైతుల ఖాతాల్లో నేరుగా రూ.5000
### మోదీ ప్రభుత్వం కొత్త స్కీంపై సన్నాహాలు

న్యూ డిల్లీ, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): రైతులకు మరో ప్రయోజనం కల్పించేందుకు మోదీ ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద రైతులకు ప్రతి సంవత్సరం రూ .12000 లభిస్తుంది. ఈ డబ్బు 3 విడతలుగా అందిస్తున్నారు. అయితే దీనికి అదనంగా మరో 5000 రూపాయలు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సంకల్పించింది. దీంతో రైతులకు సంవత్సరానికి రూ .17 వేలు కేంద్రం ఇవ్వనుంది. ఈ డబ్బు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీంతో రైతులు ఈ డబ్బు కోసం ప్రభుత్వ అధికారులు, బ్రోకర్ల చుట్టూ తిరిగాల్సిన అవసరం లేదు. అయితే ఈ 5000 రూపాయలు ఎన్ని వాయిదాల్లో ఇస్తారో చూద్దాం.

కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక ఇదే.. దేశంలోని ఎక్కువ మంది రైతులు ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో చేరాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. అటువంటి పరిస్థితిలో, ఎరువుల సబ్సిడీగా ప్రతి సంవత్సరం నేరుగా తమ బ్యాంకు ఖాతాలో 5000 రూపాయలు ఇస్తే, అది రైతులకు చాలా లబ్ది చేకూరనుంది. ఇప్పటివరకు ఎరువుల కంపెనీలకు, అలాగే ఎరువులు విక్రయించే సహకార సంస్థలకు సబ్సిడీ డబ్బు ఇచ్చేవారు. అయితే అందుకు బదులుగా ఇప్పుడు రైతులకు ఎరువులు సబ్సిడీ డబ్బు నేరుగా ఇచ్చేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంకల్పించింది.

### రూ.5000 పొందడం ఎలా...

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా పనిచేస్తోంది. పంట సమయంలో రైతుకు ఎరువుల సబ్సిడీ డబ్బులు ఇస్తే...అది వారికి ఉపయోగపడుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఎందుకంటే చాలా మంది రైతులు సబ్సిడీ ఎరువులను చౌకగా పొందలేకపోతున్నారు. అయితే ఇప్పుడు నేరుగా సబ్సిడీ సొమ్ము రైతు ఖాతాల్లో వేస్తే వారికి ఉపయోగపడుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రభుత్వానికి చేసిన సిఫారసు ప్రకారం రైతులకు రూ .2500 చొప్పున 2 విడతలుగా సబ్సిడీ సొమ్మును అందించనున్నారు. మొదటి విడత ఖరీఫ్ పంట సమయంలో, రెండవ విడత రబీ ప్రారంభంలో ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్ ప్రతి సంవత్సరం నేరుగా రూ .5 వేల సబ్సిడీని రైతుల బ్యాంకు ఖాతాకు సిఫారసు చేసింది. రైతులకు 2 విడతలుగా రూ .2,500 ఇవ్వాలని కమిషన్ సిఫారసు చేసింది. మొదటి విడత ఖరీఫ్ పంట సమయంలో, రెండవ విడత రబీ ప్రారంభంలో ఇవ్వాలని తెలిపింది. దీనితో రైతులు తమకు కావలసిన మార్గం నుండి ఎరువులు మార్కెట్ నుండి కొనుగోలు చేయవచ్చు. తద్వారా వ్యవసాయం సులభంగా చేయవచ్చు. ఈ సిఫారసు ఆధారంగా రైతులు ఏటా 5000 రూపాయలు చెల్లించడం ప్రారంభిస్తే, వ్యవసాయంలో భారీ మార్పు రావచ్చు. ప్రస్తుతం, కంపెనీలకు ఇచ్చే సబ్సిడీలలో భారీ కుంభకోణం ఉంది. ప్రతి సంవత్సరం, సహకార సంస్థలు మరియు అవినీతి అధికారుల కారణంగా, అవసరమైన సమయంలో ఎరువుల కొరత ఉంది. అటువంటి పరిస్థితిలో, రైతులు తరచుగా ఎరువులను బ్లాక్ మార్కెట్లో కొనవలసి ఉంటుంది. కానీ రైతుకు నేరుగా సబ్సిడీ డబ్బు లభిస్తే, అతను స్వయంగా మార్కెట్ నుండి ఎరువులు కొనగలుగుతాడు.

## చరిత్రలో నేటినిజం



కం|| సినిమాలో నాయికగా
ఘనతర ముఖ్యంగ యువని కేను తన నటనా
ధునితో ముంచెత్తినదని
ప్రణతులనిడి... నే... గాలటు "అపర్ణాసేనున్"!!

( అక్టోబర్ 25 అపర్ణాసేన్ జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210



## దేవేంద్ర ఫడ్నావిస్‌కు కరోనా పాజిటివ్

### -14 రోజుల పాటు క్వారంటైన్‌లో..

మహారాష్ట్ర, అక్టోబర్ 24(ఆర్ ఎన్ ఏ): బీహర్ ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ బీజేపీ అగ్రనేతలను కరోనా కలవరం పెడుతుంది..బీహర్ ఎన్నికల ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న మహారాష్ట్ర మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది..14 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉండాలని ఆయనకు సూచించారని..ఈ మేరకు ట్విటర్‌లో ప్రకటించారు దేవేంద్ర ఫడ్నావిస్..గత నాలుగు రోజులగా తనను కలిసిన కార్యకర్తలు, సన్నిహితులు, నేతలు కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కరోనా లాక్డౌన్ మొదలైనప్పటి నుండి నేను ప్రతి రోజూ పని చేస్తున్నాను, కాని ఇప్పుడు నేను విశ్రాంతి తీసుకోవాలని దేవుడు కోరుకుంటున్నట్లు అనిపిస్తుందన్నారు ఫడ్నావిస్.. వైద్యుల సలహా మేరకు అన్ని మందులు, చికిత్సలు తీసుకుంటున్నా న్నారు.బీహర్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీకి ఎన్నికల ముందు ఎన్నికల ఇంచార్జ్‌గా ఉన్న ఫడ్నావిస్‌కు కరోనా రావడం పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు..బీహర్ ఎన్నికలను దగ్గరి నుంచి పరిశీలిస్తున్న ఫడ్నా విస్‌కు కరోనా రావడంతో దాని ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఉండే అవకాశాలు ఉన్నాయి.

## రోడ్డు ప్రమాదం-3గురి మృతి

తడ,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం కారులో ప్రయాణిస్తున్న ఐదు మందిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి మృతి చెందారు. నెల్లూరు నాలుగవ మైల్ పద్మావతి రైస్ సెంటర్ కు చెందిన వారుగా గుర్తించిన పోలీసులు.

## అలయ్-బలయ్ లేదు : గవర్నర్ దత్తాత్రేయ

హైదరాబాద్, అక్టోబర్ 24: ఇటీవల నగరాన్ని వరదలు ముంచెత్తడం, కొవిడ్ మహమ్మారి ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య సంరక్షణ దృష్ట్యా ఈ ఏడాది అలయ్-బలయ్ నిర్వహించడం లేదని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం ప్రకటనలో తెలిపారు.

వినాయక సాగర్ ఒడ్డున యేటా ఆనవాయితీగా నిర్వహించే సాంస్కృతికోత్సవాలు ఈ సారి ఉండవని ఆయన పేర్కొన్నారు. కొవిడ్ కారణంగా ఈ సారి ప్రజలంతా తమ ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది ఆనందోత్సాహాల నడుమ అందరం ఓ చోట కలిసి పండుగ చేసుకుందామని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా దసరా సందర్భంగా అన్నిపార్టీల నాయకులు, కళాకారులు, ప్రముఖులంతా కలిసి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# రోతగా బిజెపి కరోనా రాజకీయాలు

నేటినిజం

ఆదివారం 25-10-2020

రానురాను బిజెపి రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి. ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన కేంద్రం తీరు మరీ అధ్వాన్నంగా తయారయ్యింది. కరోనా వేళ అంతా ఆందోళనలో ఉంటే బిజెపి మాత్రం రాజకీయాలు చేస్తోంది. మిగతా పార్టీలు ఎలా చేసినా ఫర్వాలేదు... కానీ అధికారంలో ఉన్న పార్టీ కరోనాపై రాజకీయాలు నడపడమే అసహ్యం కలిగిస్తోంది. బీహార్‌లో అధికారం కోసం కరోనా ఉచితహామీ ఇవ్వడం దారుణమైన విషయంగా గుర్తించాలి. నిబద్ద రాజకీయాలు నడుపుతామన్న బిజెపి పాలకులు ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం సామాన్యులను సైతం కలవరానికి గురిచేసేలా ఉంది. కరోనా టీకాను దేశప్రజలందరికి అందించే యత్నాల్లో ఉన్నామని అప్పట్లో ప్రధాని మోడీ ప్రకటించారు. వ్యాక్సిన్ ప్రయోగద శలో ఉండగా బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మ్యానిఫెస్టో చూస్తే ప్రజల్లో ఓ రకమైన భయం ఆవరించేలా కనిపించింది. రేపు వ్యాక్సిన్ వచ్చినా మనకు దక్కుతుందా అన్న భయం సామాన్యులకు కలిగేలా బిజెపి ప్రవర్తించింది. నిజానికి బీహార్ ఇంతకాలం ఎన్నికల్లో అధికారంలో ఉన్నదే వారు. అక్కడ ఏం ఘనకార్యాలు చేశారో వెల్లడించకుండా కరోనాను బీహార్ రాజకీయాల్లోకి లాగడం ద్వారా బిజెపి తన కుత్సిత బుద్దిని బయట పెట్టుకుంది. ఇక బిజెపి కన్నా తమిళనాడు సర్కార్ నయం. ఇంకా ఎన్నికలకు సమయం ఉంది. అయినా తమ రాష్ట్రంలో ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ప్రజలందరికి ఇస్తామని ప్రకటించారు. కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి రాగానే రాష్ట్రం లోని ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ప్రకటించారు. అందుకయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. కరోనా ప్రభావం ప్రజలను భయాందోళ నకు గురిచేసిందని, వేల సంఖ్యలో పాజిటివ్‌కు గురికాగా, మరెందరో ప్రాణాలు కూడా కోల్పోయారని అన్నారు. వైరస్ మహమ్మారి పూర్తిగా నశించిపోయే వరకు అహర్నిశలు పాటుపడతామని, కరోనా సోకకుండా వ్యాక్సిన్‌పై ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది చివర్లోగా వ్యాక్సిన్ మార్కెట్‌లో విడుదల అవుతుందని ఆశిస్తున్నామన్నారు. ఆశుభ ఘడియ రాగానే ప్రభుత్వమే పూర్తి ఖర్చును భరించి రాష్ట్ర ప్రజలందరికీ పూర్తి ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని పళనిస్వామి చెప్పారు.

బీహార్ ప్రకటన...ఆ వెంటనే తమిళనాడు సిఎం ప్రకటన చూస్తుంటే కేంద్రం కరోనా ఖర్చులను, బాధ్యతలను రాష్ట్రాలపై రుద్దాలని చూస్తున్నట్లుగా ఉంది. ఏ రాష్ట్రం ఖర్చు ఆ రాష్ట్రమే భరించాలన్న ఓ సంకేతాన్ని బిజెపి ఇస్తుందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. దేశ ప్రజలందరికీ కరోనాను ఉచితంగా అందిస్తామని చెప్పి ఉంటే బాగుండేది. కరోనాతో దేశం అల్లకల్లోలంగా మారింది. ప్రజల ప్రాణాలు పోతున్నాయి. జీవనోపాధి గంగలో కలిసింది. ఈ దశలో దేశం భవితవ్యం ఏమి కానున్నదో అని ఆందోళన పడుతున్న వేళ బిజెపి ఎన్నికల ప్రచారం కోసం చేసిన కరోనా ఉచిత ప్రకటన సహజంగానే ఆందోళన కలిగిస్తోంది. కరోనా కన్నా..బిజెపి తీరే ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచానికంతటికీ మహమ్మారిగా మారి, ఎనిమిది నెలల నుంచి వేధిస్తున్న ప్రాణాంతక వైరస్‌కు లభించబోయే వ్యాక్సిన్‌ను ఓటర్లకు ఒక తాయిలం లాగా భారతీయ జనతాపార్టీ ఇవ్వజూపడం అన్నది క్షమించరాని నేరంగానే చూడాలి. దేశ ప్రజలకు భరోసా ఇవ్వలేని పాలకులు మనలను ఏలుతున్నారని గమనించాలి. బిజెపి బీహార్ ఎన్నికల మ్యానిఫెస్టో చూశాక దేశమంతా ఆశ్చర్యపోయి ఉంటుంది. ఉచిత టీకా వాగ్దానం గురించి వినగానే, అనేక ప్రశ్నలు ముందుకు రావడం సహజం.

బిజెపి కూటమికి ఓటు వేస్తేనే బిహార్ ప్రజలకు ఉచిత వ్యాక్సిన్ అందిస్తే..మరి ఎన్నికలు లేని మిగతా దేశ పరిస్థితి ఏంటన్న ప్రశ్న ఉదయిస్తోంది. ప్రధాని గతంలో చ,ఏసిన ప్రకటన ఆధారంగా పరిశీలిస్తే..దేశమంతటికీ ఉచితంగానే టీకా ఇచ్చేట్టయితే, బిహార్‌కు అది ప్రత్యేకమైన అంశంగా ఎందుకు మారిందన్నది ప్రశ్న. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దిగజారిన రాజకీయాలకు కారణంగా మారడం ఆశ్చర్యంగా ఉంది. ఒక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ఇంతగా దిగజారాల్సిన అసవరం ఉందా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రజల కోసం బాగా పని చేసి ఉంటే ..వారు తమ పనులను చెప్పు కోవాలి తప్ప మరోటి కాదు.కొవిడ్ టీకాను కూడా సార్వజనీన టీకా కార్యక్రమంలో భాగంగా చేసి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని గతంలో చెప్పిన ప్రధాని.. ఇప్పుడిలా మాట మార్చి చెప్పించడం సిగ్గు చేటుగా భావించాలి. నిజంగా ఇలా ప్రకటన చేసినందుకు జాతికి క్షమాపణలు చెప్పాలి. ఈ దేశ ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ప్రధాని మోడీ దిగజారుడు రాజకీయాలను ప్రోత్సహించడం దారుణం కాక మరోటి కాదు. మరోవైపు తమ ప్రకటనను బిజెపి నేతలు సమర్థించుకోవడం మరింత దారుణం. కరోనా వ్యాక్సిన్ కోసం దేశ ప్రజలందరికి అందించాలంటే 59 వేల కోట్లు అవసరమవు తుందన్న అంచనాలు ఇటీవల వినిపించాయి. టీకా ప్రయోగ దశలో ఉందని, అది విజయం కావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పిన బిజెపి నాయకులు ఇవాళ రాజకీయ ప్రయోగంగా మార్చిన తీరుతో ప్రజల్లో నమ్మకం సడలింది. ఇకపోతే ప్రధాని ఎన్నికల ప్రచారంలో కూడా హుందాతనం కనిపించలేదు. కనీసం తన ప్రంగంలో అయినా దేశ ప్రజలందరికీ ఉచితంగానే టీకా అందిస్తామని చెప్పవుంటే ప్రజలు సంతోషించే వారు. బీహార్ సైనికుల త్యాగాలను ప్రస్తుతించడం మంచిదే అయినా..దేశంలో అన్ని ప్రాంతాల వారు సైన్యంలో ఉండి పోరాడుతున్నారన్న కనీస పరిజ్ఞానం ప్రధాని మరిచారు. గత ఐదేళ్లుగా బీహార్‌లో నితీశ్ కుమార్ రాజ్యమేలుతున్నారు. ఆయన ఎంత బాగా చేశారో అన్నది ప్రజలు తేల్చబోతున్నారు. కరోనా సమయంలో ఎంతబాగా పనిచేశారో కూడా ప్రజలు గమనించారు. నితీశ్ బాగా పనిచేశారని, కరోనాను కట్టడి చేశారని ప్రధాని మోడీ కితాబునిచ్చారు. బిజెపి, నితీశ్ రాజకీయాలు సరైనవే అయితే ప్రజలు తీర్పు సరిగానే ఇస్తారు. లేకుంటే నిలదీస్తారు. కనీసం ఇప్పటికైనా బిజెపి వివరణ ఇచ్చి దేశప్రజలకు కరోనాపై ఉన్న అనుమానాలను, భయాలను తొలగించాలి. ప్రజలకు ఎలాగూ బతికే ధైర్యం ఇవ్వలేకపోయారు. కనీసం టీకా ఉచితంగానే అన్న భరోసా ఇచ్చి పరువు కాపాడకుంటే బిజెపికే మంచిది.

## ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలపై భారం

### -మక్క రైతులను ఆదుకోవడం మంచి పరిణామం

సిద్దిపేట,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలపై అధిక భారం మోపుతోందని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. దీంతో పేద,మద్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. దుబ్బాక ప్రచారంలో ఆయన ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకుఇన వెళుతున్నారు. అధికార పార్టీ నేతలను ఎల్ఆర్ఎస్‌పై నిలదీయాలని అన్నారు. ప్రజలపై మోపిన ఈ భారాన్ని ఉపసంహరించుకుని వెంటనే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలన్నారు. లే అవుట్ అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం ముందే చెప్పి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడ్డ వారు మాత్రమే స్పందించే వారని చెప్పారు. ప్రభుత్వ వైఖరి వల్ల ప్రజలందరిపై భారం మోపినట్లయిందన్నారు. ఇకపోతే మక్క రైతులకు ఆలస్యంగా అయినా ప్రభుత్వం న్యాయం చేయాలని నిర్ణయించడం మంచి పరిణామమన్నారు. రైతులు తమకు అనుకూలంగా ఉండే పంటలను పండిస్తారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస బాధ్యత అన్నారు. నూతన వ్యవసాయ చట్టం కార్పొరేట్ సంస్థల కోసమేనని అన్నారు. వ్యాపారస్తులకు వ్యవసాయ ఉత్పత్తులను నిలువ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని దీంతో మద్దత ధర పొందక రైతులకు నష్టం కలుగుతుందన్నారు. నూతన వ్యవసాయ చట్టంలో రైతులు పండించిన పంటకు రైతుకు రక్షణగా కనీస మద్దతు ధర కల్పించాలని చట్టంలో ఏమైనా పొందుపరిచారా అని ప్రశ్నించారు. దేశంలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారని వారు పండించి పంటను ఇతర రాష్ట్రాలకు ఎలా అమ్ముకుంటారని అన్నారు. దేశంలో కొరత ఉన్నటువంటి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి కోసం అనుమతి ఇవ్వాలే తప్ప స్థానికంగా పండే వ్యవసాయ ఉత్పత్తులకు విఘాతం కలిగించ వద్దని అన్నారు.

## ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలపై భారం తగదు

### వరద కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలి

### -బిజెపి నేత ఎన్వీఎస్ ప్రభాకర్

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లు, అందులోని ప్లాట్ల క్రమబద్ధీకరణ చేయడానికి లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భారం మోపడం సరికాదని బిజెపి నేత,మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్ అన్నారు. వరదల్లో నష్టపోయి ప్రజలు అల్లాడుతున్నందున ప్రభుత్వమే ఉచిత ఎల్ఆర్ఎస్ స్కీమ్ అమలు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు భారం మోసే స్థితిలో లేరని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అనుమతుల్లేని లేఅవుట్ వెంచర్లన్నీ తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల అనధికార ప్లాట్లు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించినట్టు చెబుతున్నారు. ఈ 16 లక్షల మంది అప్లై చేసుకుంటే వచ్చే ఫీజుతోనే సుమారు రూ.160 కోట్ల ఆదాయం వస్తుంది. ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు 2021 జనవరి 31 వరకూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నట్లయితే 16 లక్షల ప్లాట్లకు గాను ఒక్కో దానికి సుమారు రూ.50 వేల చొప్పున వేసుకున్నా, రూ. 8వేల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశముంది. ప్రభుత్వం ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం పడుతోంది. కరోనా ఉపాధి కోల్పోయి ఆర్థికంగా చితికిపోయిన దయనీయమైన స్థితిలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తీసుకొచ్చి నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటని ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి నేడు వేల కోట్ల రూపాయలు ఎల్ఆర్ఎస్ పేరుతో వసూలు చేయడానికి పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పరోక్షంగా ప్రజలను ప్రభుత్వం బెదిరించి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నట్టు స్పష్టంగానే కన్పిస్తోందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఆరేళ్లు అవుతున్నా ఇప్పటివరకూ ఎందుకు అనుమతి లేని ప్లాట్లు, లేఅవుట్లకు రిజిస్ట్రేషన్ చేయనిచ్చారని ప్రశ్నించారు.

## ఢిల్లీని ముంచెత్తుతున్న కాలుష్యం

న్యూఢిల్లీ,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పతాక స్థాయికి చేరింది. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చేపే అవకాశం ఉందని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ తెలిపింది. కాలుష్యం పెరుగడంతో ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులను ఎదుర్కొంటున్నారు. మరికొందరు పిల్లలు గొంతు సమస్యలతో బాధపడుతున్నారు.

ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎట్టిపరిస్థితుల్లో బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాయుకాలుష్యం జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు, నిర్మాణ సంస్థలు, మున్సిపల్ సంస్థలు, ట్రాఫిక్ పోలీస్, ఎన్‌సీఆర్ సహా పలు సంస్థలు, ట్రాఫిక్ పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఇటీవల కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఢిల్లీ హైకోర్టుకు ఇటీవల నివేదిక సమర్పించింది.

రాబోయే రోజుల్లో వాయుకాలుష్యాన్ని అరికట్టేందుకు పటాకలు కాల్చడం, దిష్టిబొమ్మల దహనంపై కఠిన నిషేధం విధించేలా సాధ్యమైనంత తర్వగా ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిలకు ఆదేశాలివ్వాలని శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దసరా పండుగను పురస్కరించుకొని పర్యావరణ అనుకూల మార్గాలపై కేంద్ర పర్యావరణ శాఖ, ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో దసరా పండుగ సందర్భంగా ఢిల్లీలో పటాకలు కాల్చడంపై నిషేధం విధించేలా తగిన చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు కోర్టును కోరారు.

## పంట నష్టం నివేదిక ఇవ్వని రాష్ట్రం: సిఎం రమేశ్

న్యూఢిల్లీ,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): రాయలసీమలో శెనగ పంట నీటిపాలయిందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఒక లేఖ రాసి వదిలేసిందని ఎంపీ సీఎం రమేష్ తప్పుబట్టారు. కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదని, కేంద్ర బృందం రాష్ట్రాని వచ్చి పంట నష్టం అంచనా వేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో సబ్సిడీ, పనిముట్లు, ఎరువులు ఇవ్వడంలేదని, రాష్ట్రంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీఎం రమేష్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఏపీలో తీవ్ర నష్టం జరిగింది. వర్షాలకు చేతికి వచ్చిన పంట దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. రాయలసీమ ప్రాంతంలో 15 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట నష్టం జరిగిందని, రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దండకారణ్యంలో కూంబింగ్

## కంటిమీద కునుకు లేకుండా జనం

ఆసిఫాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): వరుస ఎన్‌కౌంటర్లు, కూంబింగ్‌లు దండకారణ్య ప్రాంత ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ను పట్టుకోవడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం వ్యూహాత్మకంగా కార్యచరణ అమలు చేస్తోంది. ఇందుకోసం భారీగా కూంబింగ్ కొనసాగుతోంది. స్థానిక పోలీసు బలగాలతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు, రిజర్వ్ బలగాలు ఇప్పటికే మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా గాలింపులు జరుపుతున్నారు. తాజాగా వీరికి అదనంగా మావోయిస్టుల అణచివేతలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రేహౌండ్స్ బృందాలను కూడా రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. మార్చి 22న లాక్‌డౌన్ ప్రకటించిన తరువాత ఛత్తీస్‌గఢ్ నుంచి వలస కూలీల వేషంలో మావోయిస్టులు ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాలకు చేరుకున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. సుమారు 15 మంది సాయుధులతో కలిసి భాస్కర్ కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఇద్దరు మావోయిస్టుల్లో ఒక దళ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవాడు కావడం పై విషయానికి బలం చేకూర్చుతోంది. ఈ ఎన్‌కౌంటర్ నుంచి భాస్కర్, అతని సహచరి తప్పించుకొని పారిపోయినట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించినా అంతక ముందే వారు సురక్షిత ప్రాంతానికి వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత పట్టుదలతో భాస్కర్ లక్ష్యంగా సరిహద్దు అడవులను జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే ఆసిఫాబాద్ జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి అడవుల్లో ఇటీవల మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా రెడ్అలర్ట్ ప్రకటించి మావో యిస్టులు సంచరించే అవకాశాలున్న ప్రాంతాలపై నిఘా పెట్టారు. కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని తుద ముట్టించే లక్ష్యంతో కొంతకాలంగా ఆపరేషన్ ప్రహార్ పేరిట వ్యూహాత్మకంగా నక్సల్ ప్రభావిత రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని సమన్వయ పరుస్తూ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. దీనికితోడు ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్‌కు సీనియర్ సలహాదారుడిగా వ్యవహరిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను రంగంలోకి దింపింది. తీవ్రవాదం అణచివేతలో అపార అనుభవం ఉందన్న ఉద్దేశంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల మావో యిస్టులను ఏరివేసే బాధ్యతలను అప్పగించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఇటీవల డీజీపీ మహేందర్‌రెడ్డి ఐదురోజుల పాటు ఆసిఫాబాద్‌లో మకాం వేసి మావోయిస్టుల ఏరివేతకోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఇంటెలిజెన్స్ వ్యవస్థ నిర్మాణంలో ఆయనకు సహకరించినట్లు చెబుతున్నారు. తమిళనాడులో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్‌గా వ్యవహరించిన విజయ్‌కుమార్ అడవి దొంగ వీరప్పన్‌ను అంతమొందించేందుకు చేపట్టిన ఆపరేషన్ 'కకూన్ ' విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాదు, జమ్మూకశ్మీర్‌లో సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ముఖ్య సలహాదారుడిగా వ్యవహరించారు.ఈ క్రమంలో మావోయిస్టు ఆపరేషన్లలో ఆరితేరిన పోలీసుల అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే సరిహద్దు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా కేంద్ర ఇంటెలిజెన్స్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ అందించే సమాచారాన్ని విశ్లేషిస్తూనే సెంట్రల్ టీంలు అందించే సమాచారాన్ని కూడా ఎప్పటికప్పుడు బేరీజు వేస్తారు. దీన్ని క్రోడీకరించి మావో యిస్టు బృందాల కదలికలపై ఆపరేషన్‌లో ఉండే బలగాలకు సమాచారం అందిస్తూ మావోయిస్టులను తుద ముట్టించాలన్నది ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.

# మార్కెట్‌లోకి తడిసిన ఉల్లిగడ్డలు

## అయినా తగ్గని ధరలు

## దసరాతో పెరిగిన కొనుగోళ్లు

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): దసరా తోడు కావడంతో ఉల్లి ధరలు ఘాటు తగ్గడంలేదు. అయితే ధరలకు తోడు నాణ్యతలేని ఉల్లి మార్కెట్‌ను ముంచెత్తు తోంది. వర్షాల కారణంగా తడిసిన ఉల్లి వస్తోందని కొనుగోలుదారులు వాపోతు న్నారు. తడిసిపోయినగడ్డ అయినా ధరలు మాత్రం తగ్గడం లేదు గతకొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో భారీగా వర్షాలుకురు స్తున్నాయి దీంతో చాలా రాష్ట్రాల్లో ఉల్లిపంట తీవ్రంగా నష్టపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. కోతకొచ్చిన పంట కూడా వర్షాల కారణంగానే తడిసిముద్దయి పోతోంది పెరిగిన ధరల నేపథ్యంలో వ్యాపారులు తడిసిన ఉల్లిగడ్డ అయినా సరే అధిక ధరలకే విక్రయిస్తున్నారు. రెండు వారాల క్రితం హోల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లిధరలు క్వింటాల్‌కు 5500 నుంచి 6000 పాయల వరకు పలికాయి. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లిగడ్డ 60 నుంచి 70రూపాయల వరకు పలికింది. ప్రస్తుతం భారీగా ఉల్లివస్తున్న నేపథ్యంలో ధరలు స్వల్పంగా తగ్గాయి. దీంతో కిలో వందను దాటేసింది. నాణ్యమైన ఉల్లి 120 వరకు చేరింది. మార్కెట్‌కు దిగుమతి అవుతున్న ఉల్లిగడ్డలో 90శాతం పూర్తిగా తడిసిపోయినదే ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. అయితే సరుకు తడిసిపోయిందన్న కారణంతో వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరలకే వాటిని కొనుగోలుచేస్తున్నారు. తీరా రిటైల్ వ్యాపారులకు అమ్మే సమయంలో కమిషన్‌ఏజెంట్లు ఆ ధరలను రెట్టింపుచేస్తున్నారు. తీరా వినియోగ దారుడికి చేసే సరికి మరింత పెరిగిపోతోంది తడిసిపోయిన ఉల్లిగడ్డ అయినా సరే రిటైల్ మార్కెట్‌లో కిలో 50 నుంచి 60 రూపాయలకు అమ్ముతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు తక్కువ సంఖ్యలో ఉల్లి లారీలు వస్తున్నాయి. దీంతో ధరలు మాత్రం తగ్గడం లేదు. విదేశాల్లో కూడా ధరలు బాగా ఉండడంతో చాలా మంది ఉల్లిగడ్డను దొంగచాటుగా రాష్ట్రం దాటించేస్తున్నారు. ముఖ్యంగా కోల్‌కతా నుంచి సరిహద్దుల గుండా బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఉల్లిఎగుమతులను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిషేధించింది.

వారంరోజుల కిందట చౌకగా లభించిన ఉల్లి.. ఇప్పుడు సామాన్యుడి కొనలేని రేటుకు వెళ్లిపోయింది.

ఈసారి వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో సరఫరాకు కూడా అంతరాయం కలుగుతోంది.ఉల్లిగడ్డ ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా మారింది. ఇక, ఉల్లితో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో కూడా ధరలు పెరిగిన సందర్భాల్లో పలుచోట్ల ఉల్లి దొంగతనాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఉల్లి కోసం గొడవలు కూడా జరిగాయి. ధరల విషయంలో వినియోగదారులు, అమ్మకపుదారులు ఘర్షణకు దిగారు.

# అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాలు! ఆర్జేడీ మేనిఫెస్టో




పాట్నా, అక్టోబర్ 24: బీహార్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) శనివారం ఉదయం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. ఈ సందర్భంగా తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.. ఆర్జేడీ అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. బీహార్‌ను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దటమే ఆర్జేడీ లక్ష్యమని స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ మాదిరి 19 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అసత్యపు హామీ ఇవ్వమని తేల్చిచెప్పారు. పాలనలో సీఎం నితీశ్ కుమార్ విఫలమయ్యారు. నిరుద్యోగం, కరోనా, వలసల నివారణలో నితీశ్ విఫలమయ్యారని తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. 243 స్థానాలున్న శాసనసభకు మూడుదశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబర్ 28, నవంబర్ 3, 7 తేదీల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 10న ఫలితాలు వెల్లడిస్తారు.

## బట్టల వ్యాపారి ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్24(నేటినిజం ప్రతినిధి): ): సిరిసిల్ల పట్టణంలో దారుణం జరిగింది. ఓ బట్టల దుకాణం యజమాని ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్లలోని అనంతనగర్‌కు చెందిన గాజుల జనార్ధన్(32) ఇంట్లో నుంచి వెళ్లి సిరిసిల్లలోని బైపాస్ రోడ్‌లో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. శనివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతోనే అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. జనార్ధన్‌కి భార్య ఉండగా సంతానం కలగలేదు. సీఐ వెంకటనరసయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## తల్లితో గొడవపడ్డ తనయుడు

### -పీకలదాకా తాగి తల్లి పీక కోసిన దుర్మార్గుడు

నాగర్‌కర్నూల్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. తన తల్లిని కిరాతకంగా నరికి తలతో పరారీ అయ్యాడు. ఈ దారుణ ఘటన కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పుట్ట చంద్రమ్మ(60)కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తన భార్యాపిల్లలతో కలిసి ఉంటుండగా, చిన్న కుమారుడు పుట్ట రాములు(45) భార్యకు దూరంగా ఉంటున్నాడు. తల్లి చంద్రమ్మ వద్దే రాములు ఉంటున్నాడు. ఈ క్రమంలో రాములు తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి పీకల దాకా మద్యం సేవించిన రాములు.. తల్లితో గొడవ పడ్డాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇచ్చేందుకు తల్లి నిరాకరించగా.. ఆవేశంతో ఆమెను కొడవలితో నరికి చంపాడు. ఆ తర్వాత తలను తీసుకుని ఇంట్లోనుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న కొల్లాపూర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నిందితుడి ఆచూకీ కోసం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## సింగరేణిలో 26న సెలవు

మంచిర్యాల,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): సింగరేణి కార్మికులకు శుభవార్త. ఈ నెల 25న దసరా సెలవు ఉండగా దానిని 26 కు మార్చాలని కార్మిక సంఘ నేతలు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో సెలవును 25వ తేదీ నుంచి 26కు మారుస్తూ సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం 26వ తేదీన సెలవు ప్రకటించాయి. తమ విజ్ఞప్తి మేరకు 26వ తేదీకి సెలవు మార్చినందున యాజమాన్యానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టభద్ర ఓట్ల నమోదులో నేతల చొరవ

### -గ్రామస్థాయిలో వివరాలు సేకరణ

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రాజకీయాలు, వరదలు ఎలా ఉన్నా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం చురకుగా సాగుతోంది. కాంగ్రెస్,టిఆర్ఎస్, బిజెపిలు పోటీపడి నమోదు కార్యక్రమాలను చేపడుతున్నాయి. గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసిన నేతలు పట్టభద్రుల వివరాలు సేకరించి నమోదు చేయించే పనిలో పడ్డారు. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు జిల్లాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. మార్చిలో జరిగే రెండు స్థానాలు గెఉచుకునేలా ఈ మూడు పార్టీలు పనిచేస్తున్నాయి. ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయించుకునేలా, తద్వారా వారంతా తమ పార్టీకే ఓటేసేలా కార్యకర్తలు కృషి చేస్తున్నారు. ప్రధానంగా గ్రామస్థాయి కార్యకర్తలు ఓటర్లపై దృష్టి సారించాలని పార్టీ నేతలు సూచించారు. ఒక్క ఓటరునూ వదలకుండా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామన్న ధీమాతో పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రులు నియోజకవర్గ ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగినుంది. ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, పరిశీలన, తుదిజాబితా షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించింది. ఈనెల 1నుంచి ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. గతంలో ఉన్న ఓటర్లందరూ మళ్లీ కొత్తగా ఓటుహక్కు నమోదు చేయించుకోవాల్సిందేనని స్పష్టంచేసింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అన్ని రాజకీయపార్టీలు ఓటర్ల నమోదుపై దృష్టి సారించాయి. మార్చిలో జరుగనున్న ఎన్నికల్లోనూ మరోసారి విజయభేరి మోగించాలన్న సంకల్పంతో టీఆర్ఎస్ ఉంది. అందుకే పార్టీ యంత్రాంగమంతా పట్టభద్రులు ఎన్నికలపై దృష్టి సారించింది. పట్టభద్రుల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి ముఖ్యంగా పట్టభద్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బోడకుంటి సూచించారు. ఎన్నిక ఏదైనా గెలుపే లక్ష్యంగా పనిచేయడం ద్వారా మరోసారి సత్తా చాటాలని పిలుపునిచ్చారు.నవంబర్ 6నాటికి ఓటర్ల నమోదుకు అవకాశం ఉండడంతో దసరాకు వచ్చిన నేతలను పలకరిస్తూ వారి వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా బతుకమ్మ, దసరాలకు చాలామంది వచ్చారు. ఒప్పుడే దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసేలా కార్యాచరణ కొనసాగిస్తున్నారు. అన్ని పార్టీల వారు గ్రామాల్లో కార్యకర్తల సాయంతో ఈ పని పూర్తి చేసే పనిలో పడ్డారు.

## గోదారి జలాలతో బతుకమ్మ సంబరం

### అన్న మాటను సాకారం చేసిన కెసిఆర్

### బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన హరీష్ రావు

సిద్దిపేట,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): గోదావరి జలాలతో బతుకమ్మ పండుగ చేసుకుంటాం అన్న మాటను నిజం చేశామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ ఏడాది కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్న చెరువుల్లో బతుకమ్మ పండుగ జరుపుకుంటునందుకు సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీకైనా బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. జిల్లా ప్రజలకు మంత్రి హరీష్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. అలాంటి సంస్కృతి మన తెలంగాణలో ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ పండుగ వచింది అంటే ట్యాంకర్లతో నీళ్లు నింపి బతుకమ్మలు వేసే పరిస్థితి ఉండే. కానీ నేడు మన సీఎం కేసీఆర్ కృషితో కాళేశ్వరం జలకళతో నిండు కుండల్లా, మత్తల్లు దుంకుతున్న చెరువుల్లో బతుకమ్మ వేసుకునే రోజులు వచ్చాయన్నారు.

# దుబ్బాకలో డబ్బా పార్టీలకు గుణపాఠం తప్పదు

సిద్దిపేట,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏ పని చేసినా కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలకు చెందిన నాయకులు విమర్శిస్తున్నారని అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాప రెడ్డి మండిపడ్డారు. అతిగతిలేని డబ్బా పార్టీలకు చెందిన నాయకులరా ఖబర్ధార్ అని తీవ్రంగా హెచ్చరించారు. లాపత్తా లేని నాయకులు యేడాదికోసారి కూడా ప్రజల సమస్యలను పట్టించుకోలేని నాయకులు దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇప్పుడు పరస్పరం సహకరించుకుంటున్నాయని మండిపడ్డారు. దుబ్బాకలో ఆ పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. బీజేపీ, టీడీపీ నాయకులు తెలంగాణ పార్టీని, దేశంలోనే అభివృద్ధి పథంలో దూసుకు పోతే మొదటి వరుసలో ఉన్న సీఎం కేసీఆర్‌ను విమర్శించడంపై విరుచుకపడ్డారు. నియోజకవర్గానికి రూపాయి ఖర్చు చేయలేదని, సరిహద్దులు ఎక్కడ ఉంటుందో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. సద్దుల బతుకమ్మ, దసరా సందర్బంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఫసల్ భీమాను మరచిన ప్రభుత్వం

## -ప్రజలను ఆదుకోవడంలో విఫలం: బిజెపి

ఆదిలాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): కేంద్రం కిసాన్ ఫజల్ భీమా పథకం ప్రవేశపెట్టినా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం గురించి రైతులకు తెలియకుండా చేయడం ఎంతవరకు సమంజసమని బిజెపి జిల్లా నాయకుడు పాయల శంకర్ ప్రశ్నించారు. కేంద్రం నుంచి రైతులకు కోసమని ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేస్తే తెరాస ఆ నిధులను ఇతర అవసరాలకు ఉపయోగించుకుందని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను చేపడుతుండగా తెరాస ప్రభుత్వం మాత్రం వాటిని రైతులకు చేరకుండా అడ్డుకుంటోందని విమర్శించారు. ప్రాజభిప్రాయాలకు విలువ లేకుండా పోయిందన్నారు. సమస్యలను పక్కన పెట్టారని,ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అవసరం లేని పనులను చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. తెరాస ఇచ్చిన హామీలను మరచి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలతో రైతులను మోసం చేస్తూ రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రుణ మాఫీ సక్రమంగా అమలు కావడం లేదని, కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రైతులకు వర్తింప చేయడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వంద కోట్ల మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణలో కేసీఆర్ అవలంబించే తప్పుడు విధానాల వల్ల లక్ష కోట్ల అప్పుల్లోకి వెళ్లిందన్నారు. రైతుల రుణ మాఫీ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం సబిడీస్‌పై యూరియాను సరఫరా చేస్తే తెలంగాణలో ప్రభుత్వం దాన్ని కర్మాగారాలకు తరలించారని ఆరోపించారు. మిషన్ కాకతీయ కింద పనులు చేపట్టిన చెరువులకు ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడ్డాయన్నారు. మిషన్ కాకతీయ, కొత్తగా చేపట్టే ప్రాజెక్టులు గుత్తేదారుల జేబులు నింపేందుకు తప్ప రైతుల కోసం కాదన్నారు. జాతీయ విపత్తు కింద రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన కోట్ల రూపాయలను దారి మళ్లించి రైతులను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణలో దళితులకు మూడెకరాల భూ పంపిణీ కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వం దాన్ని గాలికి వదిలేసిందని అన్నారు.

# ప్రజలకు చేరువగా పాలన

## -ధరణితో సమస్యలకు చెక్: వినయ్

వరంగల్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): వరంగల్ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కట్టబడి ఉందని, ఇటీవలి వరదల నేపథ్యంలో మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళతామని చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ ప్రజలకఉ ఆయన బతుకమ్మ,దసరా శుభాకాంలు తెలిపారు. ప్రజలకు అన్ని విధాల తాము అండగా ఉంటామని అన్నారు. తెలంగాణలో ధరణి పోర్టల్ తీసుకుని రావడం మరో విప్లవమన్నారు. సిఎం కెసిఆర్ మాత్రమే ఇలా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నరాని అన్నారు. పాలనను ప్రజల చెంతకు చేర్చాలన్న తెలంగాణ సిఎం కెసిఆర్ ఆశయం గొప్పదన్నారు. దశాబ్దాల కాలంగా ఎవరూ చేయని సాహసోపేత నిర్ణయంతో పాలన సాగుతోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేందుకే అనేక కార్యక్రమాలకు కెసిఆర్ శ్రీకారం చుట్టారన్నారు. మిషన్ కాకతీయ, హరితహారం, మిషన్ భగీరథ, ప్రాజెక్టుల పునర్నిర్మాణం తదితర కార్యక్రమాలు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, పార్టీ అభివృద్ధిలో భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలకు సముచితస్థానం దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఇదే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేసే వారికి పదవులు, బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. అయితే విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేయాలని చూస్తున్నాయని అన్నారు. తాజాగా ధరణి ఏర్పాటు కూడా ఇందులో భాగమననారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ప్రచారార్భాటమే: సిపిఐ

ఆదిలాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): తెరాస ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని సిపిఐ కార్యదర్శి కలవేన శంకర్ అన్నారు. రెండు గదుల పడక గదుల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులెత్తేశారన్నారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ విషయాన్ని మరిచారని, రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడం సరికాదన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు మరవలేనివన్నారు. తెరాస ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలును విస్మరిస్తోందని ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికల్లో మళ్లీ అబద్ధాలతో ప్రచారం చేస్తోందని అన్నారు.

# సాంస్కృతిక వారసత్వం మరో తరానికి అందాలి

## -తెలుగు సాంస్కృతికి మహోత్సవంలో నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఒక తరం నుంచి మరో తరానికి అందించాల్సింది వారసత్వ సంపదలుకాదని, భాష, జ్ఞాన,సంస్కృతి అనేవే అసలైన సంపదలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఖండాంతరాల్లో ఉన్నా మన భాషను కాపాడుతూ సుసంపన్నం చేస్తున్నారని ప్రశంసించారు. బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ సంయుక్త అంతర్జాల తెలుగు సాంస్కృతిక మహోత్సవ ఆన్‌లైన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్బంగా మాట్లాడుతూ భాషను సుసంపన్న చేయాలన్నతపన పాలకులకు ఉండాలని, ఆ దిశగా అందరం ప్రయత్నం చేయాలని అన్నారు. చలం రచించిన బిడ్డల శిక్షణ పుస్తకాన్ని అందరూ చవాల్సిందన్నారు. రెండుదేశాలకు చెందిన తెలుగు సంఘాలు ఒకేతాటిపై నడవడం అభినందనీయమన్నారు. మాతృభాష పై పట్టు ఉంటేనే ఇతర భాషల మీద పట్టు సాధించలగుతుతారని పేర్కొన్నారు. విదేశాల్లో స్థిరపడిన వారి తరాల మధ్య భాష, సంస్కృతి పట్ల దూరం పెరుగతోందన్నారు. భాష, సంస్కృతి పట్ల తల్లిదండ్రులు పిల్లలకు అభిమానాన్నిపెంచాలని మంత్రి సూచించారు. భాషే జ్ఞానం కాదని, పరాయిభాష పట్ల మోజే జ్ఞానంగా కొందరు భావిస్తున్నారని అన్నారు. ఈనేపథ్యంలో మాతృభాషను పాలకులు, సగటు జీవులు కొందరు ఉద్దేశపూర్వకంగా , కొందరు తెలియక అపహాస్యం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, మాజీ ఎంపీ మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే జయ ప్రకాశ్‌నారాయణ, కార్యక్రమ నిర్వాహకులు రాజా రమేష్, వాణి మోటమర్రి, సతీష్,మధుభైరెట్టి, ప్రశాంత్, వాణి ఏలేటి, సుమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఏటా దసరా మరుసటి రోజు సెలవు

**26న సెలవు ప్రకటించిన సిఎం కెసిఆర్**
**ఉద్యోగులకు డిఎ బకాయిల చెల్లింపునకు ఆదేశాలు**
**ఆర్థిక పరిస్థితులపైనా అధికారులతో సిఎం సమీక్ష**

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): దసరా మరుసటి రోజు ఈ నెల 26వ తేదీ సోమవారాన్ని సెలవు దినంగా ప్రకటించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి ప్రతి ఏడాది దసరా మరుసటి రోజు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు షెడ్యూల్ రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై సమస్యలపై చర్చిస్తామన్నారు. 2019 జులై నుంచి ఉన్న బకాయి డీఏను ఉద్యోగులకు చెల్లించాలని ఆర్థికశాఖకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలే ఉద్యోగుల తమ సమస్యలపై నిరసన గళాలు వినిపిస్తున్న నేపథ్యంలో సిఎం కెసిఆర్ కీలకనిర్ణయం తీసుకున్నారు. ఇకపోతే 2020-21 బ్జడెట్‌పై మధ్యంతర సమీక్ష నిర్వహించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఏ శాఖలకు ఎన్ని నిధులు విడుదల చేయొచ్చో నిర్ణయించాలని, బ్జడెట్‌పై సమీక్ష నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. లాక్‌డౌన్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం భారీగా తగ్గిందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోత పడిందని తెలిపారు. కేంద్ర జీడీపీ కూడా మైనస్ 24 శాతానికి పడిపోయిందని, దీని ప్రభావం రాష్ట్రాలపై పడుతోందని కేసీఆర్ పేర్కొన్నారు. ఉద్యోగుల డీఏ విషయంలో విధానం మార్చాలని అధికారులకు కేసీఆర్ ఆదేశించారు. ప్రతి 6 నెలలకు గడువుతేదీన రాష్ట్రంలో డీఏ నిర్ణయించాలని, కేంద్ర అంచనాలు అందిన తర్వాత అవసరమైతే సవరించాలని సూచించారు. 2019 జూలై 1 నుంచి రావాల్సిన ఒక డీఏను ఉద్యోగులకు చెల్లించాలని ఆదేశించారు. దసరా మరుసటి రోజైన 26వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని కేసీఆర్ సూచించారు. వానకాలం పంటల కొనుగోలుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. ప్రగతి భవన్‌లో జరుగుతున్న ఈ సమావేశానికి వ్యవసాయశాఖ, పౌరసరఫరాలు, మార్కెటింగ్‌శాఖ మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆయాశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వానాకాలం పంటల కొనుగోలు కోసం రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఏర్పాట్లు, యాసంగిలో నిర్ణీత పంటల సాగు విధానంపై సీఎం చర్చిస్తున్నారు. ముఖ్యంగా మక్కల సాగుపై విధానపరమైన నిర్ణయం తీసుకోనున్నారు. గతేడాది ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు?.. ఎంత ధర వచ్చింది? తెలుపాలని, యాసంగిలో మక్కల సాగు లాభమా?..నష్టామా?.. ప్రస్తుత మార్కెట్‌పై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు.

**మంత్రి హరీష్‌రావుతో ఏటిగడ్డ కిష్టాపూర్ వాసుల భేటీ**
**ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకునేది టీఆర్ఎస్ అని వ్యాఖ్య**

సిద్దిపేట,అక్టోబర్23(ఆర్ఎన్ఎ): మొన్న ప్లలె పహాడ్.. నిన్న వేములఘట్.. నేడు ఏటిగడ్డ కిష్టాపూర్ ఇలా ఒక్కో ముంపు గ్రామం టీఆర్ఎస్‌కు జై కొడుతుందని మంత్రి హరీష్ రావు అన్నారు. ప్రజలు టిఆర్ఎస్ వెంట నడుస్తున్నారని చెప్పారు. తొగుట మండలంలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామం ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామస్తులు సర్పంచ్ ప్రతాప్ రెడ్డి సమక్షంలో నేడు సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీపై ప్రజలకున్న విశ్వాసానికి, నమ్మకానికి ఇదే నిదర్శమన్నారు. మీ కష్టసుఖాల్లో పాలు పంచుకొనేది, నిత్యం అందుబాటులో ఉండేది టీఆర్ఎస్ పార్టీ, తాము అని అన్నారు. నాడు గోదావరి జలాల కొరకు ముంపుకు గురైతున్నప్పుడు ముందున్నారు. నేడు పార్టీ గెలుపుకు ముందుకు వచ్చిన మీ త్యాగం వెలకట్టలేనిదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు నాడు ప్రాజెక్టును అడ్డుకునేందుకు, నేడు ఓట్లు అడిగేందుకు వచ్చారు. కానీ ఏనాడు న్యాయం చేద్దాం అని మాత్రం రాలేదన్నారు. మాయమాటలు చెప్పి అబద్దాలు, అసత్య ప్రచారాల మిమ్మల్ని వాడుకుని రాజకీయలబ్ది లబ్దిపొందాలనుకుంటున్నాయి. కానీ తాము ప్రజా సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుపై తమకు నమ్మకం ఉందని ఎప్పుడూ టీఆర్ఎస్ వైపే ఉంటామని ఏటిగడ్డ కిష్టాపూర్ ప్రజలు ఈ సందర్భంగా నినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి , జెడ్పీటీసీ ఇంద్రసేన రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మక్క రైతులకు దసరా కానుక

**మక్కలను కొనుగోలు చేయాలని నిర్ణయం**
**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే సేకరణ**
**ఆందోళనల నేపథ్యంలో సిఎం కెసిఆర్ సత్వర నిర్ణయం**

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): మక్కరైతులకు సిఎం దసరా కానుక అందించారు. మక్కరైతుల ఆందోళనల నేపథ్యంలో మక్కలను కొనుగోలు చేయాలని ప్రభుత్వంనిర్ణయించింది. నిర్దేశిత పంటల్లో మక్కలను వేయొద్దని ప్రభుత్వం ఆదేశించినా పలు చోట్ల రైతులు మక్కలను పండించారు. తాజాగా వాటి కొనుగోలు కోసం ఆందోళనకు దిగారు.

ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించిన సిఎం కెసిఆర్ మక్కలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. వరి ధాన్యం కొనుగోలు కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర చెల్లించి, మక్కలు కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. క్వింటాల్‌కు రూ. 1,850 మద్దతు ధర చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని, రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. మక్కలకు మద్దతు ధర వచ్చే అవకాశం లేదు కాబట్టి, వర్షాకాలంలో రైతులు మక్కలు సాగు చేయవద్దని ప్రభుత్వం కోరిందని, అయినప్పటికీ రైతులు మక్కల సాగు చేశారని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వద్దంటే మక్కలు సాగు చేశారని, వాస్తవానికి ప్రభుత్వానికి మక్కలు కొనుగోలు చేసే బాధ్యత లేదని సీఎం అన్నారు. అయినప్పటికీ రైతులు నష్టపోవద్దనే ఏకైక కారణంతో ప్రభుత్వం నష్టాన్ని భరించడానికి సిద్ధపడి మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు కేసీఆర్ వెల్లడించారు.

గత యాసంగిలో మార్క్ ఫెడ్ 9 లక్షల టన్నుల మక్కలను మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. దీనికోసం రూ. 1668 కోట్లు ఖర్చు చేసింది. ఆ మక్కలకు బయట మార్కెట్లో ధర లేకపోవడం వల్ల వేలం వేయాల్సి వచ్చింది. దీనివల్ల కేవలం రూ. 823 కోట్ల రూపాయలు మాత్రమే వచ్చాయి. మార్క్‌ఫెడ్ కు మొత్తంగా రూ. 845 కోట్ల నష్టం వచ్చింది. క్వింటాళుకు రూ. 1,760 చొప్పున ధర చెల్లించి మార్క్ ఫెడ్ మక్కలను కొన్నది. సేకరణ, రవాణా తదితర ఖర్చులన్నీ కలిపి క్వింటాళుకు రెండు వేల రూపాయలు ఖర్చు అయింది. కానీ వేలంలో వచ్చింది క్వింటాళుకు కేవలం 1,150 రూపాయలు మాత్రమే. క్వింటాళు కు 850 రూపాయల నష్టం వచ్చింది.

మక్కలకు దేశ వ్యాప్తంగా మార్కెట్ లేకపోవడం వల్ల తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నది అని సీఎం వివరించారు. పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే వర్షాకాలంలో మక్కలు సాగు చేయవద్దని ప్రభుత్వం రైతులను కోరింది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో పసుపుకు అంతర పంటగా కొద్ది పాటి ఎకరాల్లో మక్కలు వేసుకోవాలని సూచించింది.

ప్రభుత్వ విజ్ఞప్తిని, వ్యవసాయాధికారుల సూచనలు పాటించకుండా కొంతమంది రైతులు మక్కలు సాగు చేశారు. మక్కలకు మద్దతు ధర రాదని తెలిసినా సాగు చేసి నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. రైతు సంక్షేమం వ్యవసాయాభివృద్ధి కోసం దేశంలో మరెక్కడా లేని విధంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రైతు సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నది. రైతులను సంఘటిత శక్తిగా మలిచింది.

రైతులను సమన్వయ పరిచి దేశంలోనే మొదటి సారిగా నిర్ణీత పంటల సాగు విధానం అమలు అవుతున్నది. ఎవరూ అడగక ముందే, ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల భూమలు వద్ద లక్ష కల్లాల నిర్మాణం చేపట్టింది. 2,600 రైతు వేదికలను నిర్మిస్తున్నది. ఇన్ని పనులు చేసిన ప్రభుత్వం రైతులు నష్టపోతుంటే చూస్తూ ఉండలేక మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది అని ముఖ్యమంత్రి ప్రకటించారు. యాసంగి పంటలపై శుక్రవారం సిఎం కెసిఆర్ ప్రగతిభవన్‌లో సమీక్షించారు. పంటల విధానంతో పాటు మక్క రైతుల ఆందోళనపై చర్చించారు. ఇందులో సిఎస్ సోమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు సిసిఐ ఏర్పాట్లు

**అధికారుల సహకారంతో 13 కేంద్రాల ఏర్పాటు**

ఖమ్మం,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే సీసీఐ పత్తి కొనుగోళ్ల ప్రక్రియకు సన్నాలు చేస్తున్నామని ఖమ్మం జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి కోలహాలం నాగరాజు తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 13 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపించింది. వీటిలో 10 కేంద్రాలకు ఆమోదం లభించింది. ఖమ్మం మార్కెట్ పరిధిలో మూడు జిన్నింగు మిల్లులు, మధిర మార్కెట్ పరిధిలో నాలుగు జిన్నింగ్ మిల్లులు, నేలకొండపల్లి మార్కెట్‌లో ఒకటి, ఏన్కూర్ మార్కెట్ పరిధిలో ఒకటి, మద్దులపల్లి మార్కెట్ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లులకు అనుమతి ఇచ్చారు. వీటితో పాటు మద్దులపల్లి, మధిర, వైరా మార్కెట్ పరిధిలోని మరో మూడు జిన్నింగ్ మిల్లులకు అనుమతి వచ్చే అవకాశం ఉంది. 8శాతం నుంచి 12శాతం వరకు తేమ ఉంటే మాత్రమే కొనుగోలు చేయనున్నారు. సీసీఐ కేంద్రానికి పంటను తీసుకొచ్చే రైతులు తమ వెంట విధిగా ఒరిజనల్ రైతుగుర్తింపు కార్డు, పట్టదారు పానుపున్తకం, బ్యాంక్ ఖాతాపున్తకం, తీసుకురావాల్సి ఉంటుందన్నారు. కేంద్రాల్లో లూజు పత్తిని మాత్రమే అనుమతిస్తారు.

పత్తి విక్రయాలకు రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిన్నింగ్ కాటన్ మిల్లుల వద్ద సంబంధిత యం త్రాగాంన్ని సిద్ధం చేశారు. ఖమ్మం జిల్లాలో 2,26,130, భద్రాద్రి జిల్లాలో 1,66,368 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..

ఏడాది అధిక వర్షపాతం నమోదు కావడంతో పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది కూడా పత్తిపంటకు డిమాండ్ ఉండటం, ఈ ఏడాది అదునుకు వర్షాలు కురియడంతో రైతులందరూ పత్తి పంటపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు తోడుగా ప్రభుత్వం సకాలంలో రైతుబంధు సాయం చేతికి అందడంతో పత్తిపంటను అధికంగా సాగుచేశారు. ఏడాది పత్తిసాగు చేపట్టే రైతులకు మార్కెటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మరికొద్ది రోజుల్లో సీసీఐ కేంద్రాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయి. మధ్య దళారుల ప్రమేయం లేకుండా రైతుల పంటను మాత్రమే సీసీఐ అధికారులు కొనుగోలు చేయనున్నారు.

ధాన్యం సేకరణపై అధికారుల కసరత్తు

ఖరీఫ్ వానకాలం ధాన్యం సేకరణకు జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ , వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మొత్తం 343 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి మార్కెటింగ్ శాఖ ద్వారా కూడా 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ అధికారులకు మార్గదర్శకాలు విడుదల చేశారు. పక్కాగా ధన్యాం సేకరణ జరగాలని అన్నారు. సుమారు 4 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న అంచనాలో ఉన్నారు. ఇందుకు అవసరమైన గన్నీబ్యాగు లను సిద్ధంగా ఉంచాలని, అవి కేవలం రైతులకే అందించాలన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌తో పాటు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లులకు వచ్చే రైతులు రోజుల తరబడి వేచి ఉండకుండా, త్వరగా వారి ఉత్పత్తులను కొనుగోలు చేసి పంపే విధంగా అవసరమైన కంప్యూటర్లు, సిబ్బంది అదనంగా నమకూర్చుకోవాలని మార్కెటింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# కార్వాన్ ప్రాంత వాసులకు డబుల్ ఇళ్లు

## -26న ప్రారంభించనున్న కెటిఆర్: తలసాని

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): పాతబస్తీ పేదలకు డబుల్ ఇళల్ కల సాకారంకాబోతున్నదని మంత్రి శ్రీనివాస యాదవ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని జియాగూడ, గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని గోడే ఖీ కబర్, కట్టెల మండి లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఈ నెల 26 వ తేదీన మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రారంభిస్తారని పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన ఆయా ప్రాంతాలలో గోషామహల్ ఎంఎల్ఏ రాజాసింగ్, ఎంఎల్సి ప్రభాకర్, నాంపల్లి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఆనంద్ కుమార్ గౌడ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 26 వ తేదీ ఉదయం 10గంటలకు జియాగూడ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభిస్తారని, 10.30 గంటలకు గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని గోడేఖీ కబర్, 11.00 గంటలకు కట్టెల మండిలో నిర్మించిన ఇండ్లను ప్రారంభిస్తారని వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి శ్రీ మహమూద్ అలీ కూడా పాల్గొంటారని తెలిపారు. పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. జియాగూడ లో 840, గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని గోడే ఖీ కబర్ లో 192, కట్టెల మండి లో 128 ఇండ్లను నిర్మించినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. లబ్దిదారులపై ఒక్క పైసా భారం లేకుండా ప్రభుత్వం పూర్తి ఖర్చులతో త్రాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజి వంటి అన్ని రకాల సౌకర్యాలతో ఇండ్ల నిర్మాణం చేసినట్లు చెప్పారు. పేద ప్రజలకు వైద్యసేవలు చేరువ చేసేందుకు ప్రతి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం వద్ద ఒక బస్తీ దావఖాన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 26 వ తేదీ నాటికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ అనిల్, డీసీ సువార్త, హౌసింగ్ ఈఈ వెంకటదాసు రెడ్డి, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, కార్పొరేటర్లు జీవన్ సింగ్, ముకేష్ సింగ్, మిత్ర కృష్ణ, మమతా గుప్తా, ఎంఆర్ఓ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవారి చక్రస్నానం

**ముగిసిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు**
**శాస్త్రోక్తంగా తిరుమలేశుని శ్రీ చక్ర తిరుమంజనం**
**నేడు రంగనాయకుల మంటపంలో పార్వేట ఉత్సవం**

తిరుమల,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు జరిగిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయంలోని అయిన మహల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన చిన్న పుష్కరిణిలో ఆలయ అర్చకులు సుదర్శన చక్రాన్ని ముంచి, పవిత్ర స్నానం చేయించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం ఉదయం 6.00 గంటల నుండి శ్రీవారి ఆలయంలోని అయిన మహల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారన్నారు. రాత్రి 7.00 నుండి 8.00 గంటల మధ్య బంగారు తిరుచ్చి ఉత్సవంతో శ్రీ వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా నిర్వహించిన జీయ్యంగార్లు, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో డా. కెఎస్.జవహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. స్నపన తిరుమంజనం సందర్భంగా ఉపనిషత్తు మంత్రములు, దశశాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రములు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. తొమ్మిదిరోజుల ఉత్సవాలలో జరిగిన అన్ని సేవలూ సఫలమై లోకం క్షేమంగా ఉండడానికీ, భక్తులు సుఖశాంతులతో ఉండడానికీ చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవాలు ఒక యజ్ఞమే కనుక యజ్ఞాంతంలో అవభృథస్నానం చేస్తారు. యజ్ఞ నిర్వహణంలో జరిగిన చిన్నచిన్న లోపాలవల్ల ఏర్పడే దుష్పరిణామాలు తొలగి, ఉత్సవాలు చేసినవారికి, చేయించిన వారికి, ఇందుకు సహకరించినవారికీ, దర్శించిన వారికీ - అందరికీ ఈ ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, అదనపు ఈవో ఎవి. ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డి, కుపేంద్రరెడ్డి, డా. నిశ్చిత, చిప్పగిరి ప్రసాద్, గోవిందహరి, డిపి.అనంత, సివిఎస్వో గోపినాథ్ జెట్టి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇకపోతే ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీవారి పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ మలయప్పస్వామివారిని రంగనాయకుల మండపంలో వేంచేపు చేస్తారు. కోవిడ్ - 19 నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఆలయంలో ఏకాంతంగా నిర్వహించనున్నారు.



# రైతులను అరెస్టు చేయడం హేయ మైన చర్య : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్ . రమణ

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 24 (నేటినిజం ప్రతినిధి): జగిత్యా ల , కామారెడ్డిలో మొక్కజొన్న కొను గోలు చేయాలని సన్నరకం ధాన్యా నికి రూ .2,500 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న రైతులను అరెస్టు చేయ డాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ల్.రమణ తీవ్రంగా ఖండించారు . శనివారం వేములవాడ లో విలేకరులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు . ప్రభుత్వమే రైతు ల చేత సన్నరకాలు సాగు చేయాలని ప్రోత్సహించి ఇప్పుడు కనీస మద్దతు ధర కల్పించకపోవడం హేయమైన చర్య అన్నారు . ప్రభుత్వం వెంటనే సన్న రకం ధాన్యానికి క్వింటాలు రూ . 2,500 మద్దతు ధర కల్పించి కొను గోలు చేయాలని డిమాండ్ చేశారు . ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించనట్ల యితే రైతాంగం తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జోజి రెడ్డి ,రాజన్న సిరిసిల్ల టిడిపికరీంనగర్ పార్లమెంట్ అధికార ప్రతినిధి పులి రాంబాబు గౌడ్ ,టిడిపి నాయకులు నందిపేట వెంకట రమణ యాదవ్ , మంజు ఉమెన్ దర్ ,ముప్పిడి శ్రీధర్, చింటూ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి ఎత్తుగడలో భాగంగానే ఎల్‌జెపి ఒంటరి పోరు

**చిరాగ్ పాశ్వాన్ ఓట్ల చీలిక ఎవరికి లాభించేనో**
**రసవత్తరంగా మారుతున్న బీహార్ రాజకీయాలు**

పాట్నా,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ నాటకీయ పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. అధికార కూటమిలోని లోక్‌జనశక్తి పార్టీ(ఎల్‌జెపి) ఎన్‌డిఎ నుండి బయటకు వెళ్లిపోవడంతో అక్కడి రాజకీయాలు రంజుగా మారాయి. అయితే బిజెపికి మద్దతు పలుకుతూనే..తమ పోరంతా ముఖ్యమంత్రి నితిన్‌కుమార్ నేతృత్వంలోని జెడియుతోనే అని తెలిపింది. జెడియుతో ఏర్పడ్డ సైద్దాంతికపరమైన వైరుద్యాల వల్ల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి నుండి బయటకు వచ్చి..ఒంటరిగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. అదేవిధంగా ఎన్నికల అనంతరం బిజెపి-ఎల్‌జిపి ప్రభుత్వం ఏర్పడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేసింది. అయితే ఇదంతా బిజెపి ఆడిస్తున్న నాటకంగా, మరో కొత్త ఎత్తుగడగా పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార కూటమిపై ఉన్న ప్రజా వ్యతిరేక ఓటును చీల్చేందుకే ఎల్‌జెపిని పక్కకు తప్పించిందన్న వాదన బలంగా వినిపిస్తోంది. మరోవైపు ఎన్నో ఏళ్ల నుండి ముఖ్యమంత్రి పదవిని అంటిపెట్టుకున్న నితీష్‌పై బిజెపి నేతలు గుర్రుగా ఉన్నారు. తర్వాతి తరాలకు అవకాశం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకోవాలని చెబుతున్నా..నితీష్ ససేమిరా అనడంతో బిజెపి శ్రేణులకు మరింత మండుతోంది. నితీష్ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను విపక్షాలకు వెళ్లకుండా జాగ్రత్త పడేందుకే ఎల్‌జెపిని ప్రత్యేకంగా పోటీ చేయిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా కుల రాజకీయాలకు పెద్ద పీట వేసేందుకు ఈ చర్యలకు ఉపక్రమించిందన్న వాదన ఉంది. బీహార్‌లో అధికారం లేదా ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎల్‌జెపి ఎన్నడూ అర్రులు చాచలేదు. మరి ఇప్పుడు ఈ ఒంటరి ప్రయాణం ఎందుకోసమో..ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కచ్చితంగా బిజెపికి ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతోనే ఈ చర్యలకు దిగారని తెలుస్తోంది. నితీష్ కుమార్ తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ఈ యువజన నాయకుడు కొంత నైరాశ్యంలో కూరుకుపోయాడు. దీంతో ఆయనను ఎన్నికల్లో దెబ్బతీయాలన్న ఉద్దేశాన్ని ఏర్పరుచు కున్నారు. నితీష్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, పోలీసులు, అధికార యంత్రాంగం మా మాట వినడం లేదని..అందుకే తమ దారి తాము వెతుక్కోక తప్పలేదని చెబుతున్నారు. మొత్తంగా ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా బిజెపి వ్యూహం రచించిందని అంటున్నారు. ఎల్‌జెపి ద్వారా ఒక వైపున ప్రతిపక్షాలకు వెళ్లాల్సిన ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం..రెండో వైపున నితీష్‌ను నష్టపరిచి తమ పార్టీ కన్నా తక్కువ స్థానాలకు పరిమితం చేయడం బిజెపి వ్యూహంలో భాగం కావచ్చు. ఇదే జరిగి బిజెపి కన్నా జెడియుకు తక్కువ సీట్లు వస్తే..నితీష్‌కు కష్టాల్లో పడ్డట్టే. ఎల్‌జెపికి ఎక్కువ స్థానాలు వస్తే..కింగ్‌మేకర్ అవుతుంది. ఇక రాష్ట్రంలో ఆధిపత్యం ఎవరు చెలాయించాలో నిర్దేశించే స్థాయికి చేరుకుంటుందని అంటున్నారు. అయితే కుల సమీకరణాలకు పాశ్వాన్‌కు అనుకూలంగా లేవు. ఎందుకంటే ప్రధాన ఓటు అయిన ఆయన కులానికి చెందిన పాశ్వాన్‌లు రాష్ట్రం మొత్తం జనాభాలో 4 నుండి 6 శాతం మాత్రమే ఉన్నారు.

# నీటి గుంటలో దిగి ముగ్గురు బాలల మృతి

విశాఖపట్టణం,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): నీటి గుంటలో దిగి ముగ్గురు బాలురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన విశాఖ జిల్లాలో చోటుచేసుకుంది. అనకాపల్లి మండలం అంకిరెడ్డి పాలెంనకు చెందిన బాలురు సరదాగా ఈత కొడతామని నీటి గుంటలో దిగారు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతో నీటి మడుగులో ఊపిరాడక మృత్యువాతపడ్డారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు చనిపోవడంతో విషాదచాయలు అలుముకున్నాయి.

# దేశంలో ప్రజలందరికీ కరోనా టీకా ఉచితంగా ఇవ్వాలి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ,అక్టోబర్ 24: కరోనా టీకాను దేశ ప్రజలందరికీ ఉచితంగా ఇవ్వాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇది ప్రతి ఒక్కరి హక్కు అని ఆయన అన్నారు. వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చాక దాని పనితీరు, ఖర్చును పరిశీలిస్తామని చెప్పారు. కరోనా టీకాను ఢిల్లీ ప్రజలకు ఉచితంగా వేస్తారా అన్న మీడియా ప్రశ్నకు ఈ మేరకు సమాధానం చెప్పారు. సీలాంపూర్-శాస్త్రి పార్క్ ఫ్లైఓవర్‌ను అరవింద్ కేజ్రీవాల్ శనివారం ప్రారంభించారు. ఈ వంతెన వల్ల ఐఎస్‌బీటీ నుంచి ఉత్తరప్రదేశ్ సరిహద్దుకు పది నిమిషాల్లో చేరవచ్చిన చెప్పారు. ఈ మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండవని అన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.303 కోట్లుగా అంచనా వేయగా రూ.250 కోట్ల వ్యయంతోనే పూర్తి చేసినట్లు అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. దీంతో రూ.53 కోట్లను ఆదా చేసినట్లు ఆయన వివరించారు.

# సిసిఐ ద్వారా కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

## -పత్తి కొనుగోళ్ల కోసం పక్కాగా ఏర్పాట్లు

ఆదిలాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ఈ యేడాది పత్తి ఎక్కువగా సాగుచేసినందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మార్కెటింగ్ ఏడీ తెలిపారు. పత్తి అమ్మే రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. పత్తి అమ్మకానికి కార్డు తీసుకోని రాగానే, కోడ్ ఆధారంగా సంబంధిత రైతు వివరాలు వస్తాయన్నారు. సాగు చేసిన పత్తి విస్తీర్ణం ఎంత? సగటు దిగుబడి ఎంత, తాజాగా అమ్మకానికి తీసు కొచ్చింది ఎంత అనేది తేలుతుంది. అంత కన్నా ఎక్కువ పత్తిని తీసుకొస్తే ఆ వివరాలు నేరుగా మార్కెట్, సీసీఐ అధికారులకు చేరిపోతాయి. ఈ ఏడాది సీసీఐ తగిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ మార్కెట్‌తో పాటు, ఈ ఏడాది ఇచ్చోడల్లో నామ్ పద్ధతిన కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఈ మేరకు ఆయా మార్కెట్ల కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల వారీగా సర్వే జరుగుతోంది. ఇది పూర్తయితే కార్డులు జారీ చేసే అవకాశముందన్నారు. ఆన్‌లైన్ చెల్లింపు విధానంతో రైతు పత్తిని అమ్మిన తరువాత తిరిగి మార్కెట్ కార్యాలయం చుట్టూ తిరిగే అవసరం లేకుండా డబ్బులు జమ కాగానే రైతుల ఫోన్‌కు సందేశం వస్తుందన్నారు. మరోవైపు పత్తి అమ్మకాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, వ్యాపారులను, దళారులను నియంత్రించి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు వీలుగా ఈ ఏడాది పత్తి అమ్మకాలు పకడ్బందీగా జరిపేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా మొత్తంలో ఏటా 15 నుంచి 20 లక్షల క్వింటాళ్ల పత్తి అమ్మకం అవుతుంది. వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో పత్తి సాగు ఎక్కువగా ఉండటంతో పత్తి ఎక్కువగా మార్కెట్లకు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. గతేడాది పత్తి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేయాలని ప్రభుత్వం ప్రచారం చేయడంతో అనేక మంది రైతులు పత్తి సాగు తగ్గించి పప్పుధాన్యాలు సాగు చేశారు. వాటి వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరకపోవ డంతో తిరిగి ఈ ఏడాది పత్తి సాగు వైపు మొగ్గు చూపారు. అధికారుల లెక్కల మేరకు జిల్లా మొత్తంలో 29 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో రెండేళ్ల క్రితం పత్తి క్రయవిక్రయాలను జరి పేందుకు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు.

# మక్కలకు మద్దతు ధర రైతుల విజయం

**వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

**అన్ని పంటలకు పరిహారం చెల్లించాలి: పొన్నం ప్రభాకర్**

కరీంనగర్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): మొక్కజొన్న రైతుల ఉద్యమం కారణంగానే ప్రభుత్వం దిగి వచ్చిందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ తెచ్చుకున్న తరవాత కూడా గత ఆరేళ్లుగా సమస్య ఏదైనా పోరాటం చేయక తప్పడం లేదన్నారు. తెలంగాణలో ఇక పోరాటాలు అవసరం లేదన్న వ్యక్తి పాలనలో ప్రజలు నలిగి పోతున్నారని అన్నారు. మక్కల విసయంలో రైతులను ముందే ఆదుకోవాల్సిన సిఎం కెసిఆర్ మొండిగా వ్యవహరించారని మండిపడ్డారు. జగిత్యాలలో అర్ధరాత్రి నుంచి అప్రజాస్వామికంగా పోలీసులు రైతులను అరెస్టు చేసినా బెదరకుండా కలెక్టరేట్ ముట్టడించారని తెలిపారు. 1850 రూపాయలకు మక్కలు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం ఇది రైతుల విజయమన్నారు. ఇదే తరహాలో సన్న వడ్లను కూడా 2500 మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం సన్న వడ్లు పండించమని చెప్పడం వల్లే రైతులు ఆ పంట వేశారన్నారు. ఎకరాకు దొడ్డు వడ్లు పండిస్తే ముప్పై క్వింటాళ్లు పండుతాయి.. కానీ సన్నాలు 25 క్వింటాళ్ల మించి రావన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో ఈసారి రైతులు తీవ్రంగా నష్టపోయారరని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటాల వల్లే మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. ఇది రైతులు, కాంగ్రెస్ పార్టీ విజయమని పేర్కొన్నారు. కొంత కాలంగా మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటూ రైతులు పోరాటం చేస్తున్నారని, వారికి మద్దతుగా కాంగ్రెస్ కూడా పోరాడిందని తెలిపారు. ఈ విషయమై పార్టీ పక్షాన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశామన్నారు.

కాగా, రైతులను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ సర్కారు వారిని నిండా ముంచు తోందని పొన్నం ఆరోపించారు. అలాగే వర్షాలతో జరిగిన పత్తి నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో సుమారు 13లక్షల ఎకరాల్లో పంట నష్టం వాట్లిల్లిందని ప్రభుత్వమే చెబుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల పరిహారం అందించాలన్నారు. కాగా, వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు ఆర్థిక సాయం పంపిణీ విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మొక్కజొన్న పంటను కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం రైతుల విజయమని వ్యాఖ్యానించారు. ఇదే నిర్ణయం కొద్దిరోజుల ముందు తీసుకుని ఉంటే, రైతులకు నష్టం జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సిఎం కెసిఆర్ భేషజాలకు పోకుండా నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. అన్ని పంటలు వేసిన రైతులకు న్యాయం చేయాలన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రావద్దు

మెదక్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోలు సమయంలో పంట పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయని ఎంత పంట దిగుబడి వస్తుందో అధికారులు అంచనా వేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల్లో ఎంత విస్తీర్ణంలో పంట పండించారనే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించారని, దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అనుకున్న సమయంలో ధాన్యం సేకరణ, బియ్యం డెలవరీలు పూర్తయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఇకపోతే మెదక్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. రోడ్డు పక్కన ఉన్న నాలాలను పరిశీలించారు.

## ధరణి పోర్టల్‌కు 29న కెసిఆర్ శ్రీకారం

**దసరా బదులు 29గా నిర్ణయం**

**ట్రయల్స్ బాగున్నాయన్న సిఎస్**

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణి పోర్టల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 29న మద్యాహ్నం 12.30 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పోర్టల్ ను ప్రారంభిస్తారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా పండుగ రోజు ధరణి పోర్టల్‌ను ప్రారంభించాలనుకున్నప్పటికీ వాయిదా పడింది. మొత్తంగా ఈ నెల 29న ధరణి పోర్టల్ అందుబాటులోకి రానుంది. రెవెన్యూ సంస్కరణ ల్లో విప్లవాత్మకమైన 'ధరణి' పోర్టల్.. భూమి రిజిస్ట్రేషన్ ట్రయల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్నది. రాష్ట్రంలోని 570 మండలాల్లో తాసిల్దార్లు ఒక్కో మండలంలో 10 దస్తావేజుల రిజిస్ట్రేషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేశారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు వస్తే సరిచేయాలని అధికారులు భావించారు. కానీ, ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదని, అన్ని మండలాల్లో ట్రయల్స్ విజయవంతంగా అయ్యాయని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. దీంతో పూర్తిస్థాయి కార్యాచరణ అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ధరణి పోర్టల్‌పై తాసిల్దార్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. 'ధరణిలో రిజిస్ట్రేషన్ల విధానం చాలా బాగుంది. సులువుగా క్రయవిక్రయాల నమోదు జరుగుతున్నది' అని పేర్కొన్నారు. పోర్టల్ చాలా బాగుందని కితాబిచ్చా రు. శనివారం నాటి వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్.. ధరణి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లు, నయాబ్ తాసిల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండున్నర గంటలపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి వివరించారు. తాసిల్దార్లకు ఎంతవరకు అవగాహన వచ్చిందో తెలుసుకోవడానికి మండలానికి 10 చొప్పున ట్రయల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు తాసిల్దార్లుచేపట్టిన ట్రయల్స్ విజయవంతం అయ్యాయి.

# వీరభద్రస్వామి సేవలో మంత్రి సత్యవతి



మహబూబాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కురవిలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారిని మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి దర్శన అనంతరం మంత్రి సత్యవతి మీడియాతో మాట్లాడారు. కురవి ఆలయ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ. 5 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆశీస్సులు ఈ రాష్ట్ర రైతాంగం కోసం, ఈ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని మంత్రి తెలిపారు.

# కరోనా బారిన పడ్డ జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం

**మీడియా అకాడమీ ద్వారా 1603 మంది జర్నలిస్టులకు సాయం**

**రూ. 3.12 కోట్ల ఆర్థిక సాయం అందించాం: అల్లం నారాయణ**

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): కరోనా బారినపడ్డ జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా నిలిచిందని రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రూ. 34 కోట్ల నిధులపై వచ్చిన వడ్డీతో కరోనా బారినపడ్డ జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఆదుకున్నామని తెలిపారు. 1603 మంది జర్నలిస్టులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కాగా, వారికి రూ. 3.12 కోట్ల ఆర్థిక సాయం అందించామని అల్లం నారాయణ పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం సమాచార భవన్ మీడియా అకాడమి కార్యాలయంలో అల్లం నారాయణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభించిన నేపథ్యంలో డాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, పోలీసులతో పాటు జర్నలిస్టులు కూడా కరోనా వైరస్ బారిన పడ్డారని అన్నారు. ఫ్రంట్ లైన్ వారియర్ గా ఉన్న జర్నలిస్టులు వార్తా సేకరణలో భాగంగా పలువురు జర్నలిస్టులకు కరోనా సోకిందని, వీరిని ఆదుకోవడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఆదుకుందని అల్లం నారాయణ తెలిపారు. మీడియా అకాడమి ద్వారా కరోనా పాజిటీవ్ వచ్చిన 1517 మంది జర్నలిస్టులకు ఒక్కొక్కరికి 20 వేల చొప్పున, 3 కోట్ల 3 లక్షల 40 వేలు, దీనితోపాటు ప్రైమరీ కాంటాక్ట్ చేత హోంక్వారంటైన్లో ఉన్న 86 మంది జర్నలిస్టులకు 10 వేల చొప్పున, 8 లక్షల 60 వేలు ఆర్థిక సహాయం అందించామని అన్నారు. మొత్తంగా సంక్షేమ నిధి నుండి 1603 మంది జర్నలిస్టులకు ఇప్పటి వరకు 3 కోట్ల 12 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. మీడియా అకాడమి చరిత్రలో కరోనా బారిన పడిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించడమనేది ఒక మైలు రాయి అని చైర్మన్ అన్నారు. కరోనా సోకిన జర్నలిస్టులు తమ అక్రిడిటేషన్ గాని, గుర్తింపు కార్డు గాని, పాజిటీవ్ వచ్చిన ధృవీకరణ పత్రం, బ్యాంకు వివరాలను మీడియా అకాడమీ కార్యాలయానికి పంపిన వెంటనే సత్వరమే స్పందించి ఆయా జర్నలిస్టుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు దూరదృష్టితో 2015లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమిలో నిర్వహించిన సీనియర్ జర్నలిస్టుల సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమ నిధికి 100 కోట్ల గ్రాంట్ ఇవ్వాలనే నిర్ణయం ? తెలంగాణ జర్నలిస్టులకు రక్షణ కవచంలా తయారయ్యిందని అన్నారు. ఆ వంద కోట్ల నిధుల నుండి 34.50 కోట్ల రూపాయలు జర్నలిస్టుల సంక్షేమ నిధికి జమ అయ్యాయని, ఈ నిధి మీద వచ్చిన వడ్డీ ద్వారా జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి అమలు చేస్తున్నదని తెలిపారు. ఇలాంటి సంక్షేమ నిధి కాని, జర్నలిస్టులను ఆదుకోవడం కాని, దేశంలో ఎక్కడా లేదని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి సగర్వంగా ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులకు మీడియా అకాడమి అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. లాక్ డౌన్ సమయంలో జీత భత్యాలు లేని దాదాపు పన్నెండు వందల మంది జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు, సానిటైజర్లు, మాస్కులను మీడియా అకాడమి ఆధ్వర్యంలో పంపిణీ చేశామని ఆయన గుర్తు చేశారు. ఇప్పటి వరకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి వచ్చిన వడ్డీ ద్వారా 260 మంది చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున 2 కోట్ల 60 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించామని, అలాగే దీర&ఘకాలిక వ్యాధులు,ప్రమాదాల బారిన పడిన 94 మంది జర్నలిస్టులకు 50 వేల రూపాయల చొప్పున 47 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించామని అన్నారు. ఆర్థిక సహాయం, ట్యూషన్ ఫీజు, పెన్షన్లను కలుపుకుని మొత్తంగా వీరందరికీ 5 కోట్ల 12 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. మొత్తంగా జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి వచ్చిన 9 కోట్ల రూపాయల వడ్డీని జర్నలిస్టుల సంక్షేమానికి వినియోగించినట్లు ఆయన వివరించారు. మీడియా అకాడమి కార్యాలయానికి జర్నలిస్టులు ఆర్థిక సహాయం కోసం 37 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు, మరో 10 మంది దీర&ఘకాలిక వ్యాధులు/ప్రమాదాల బారిన పడిన జర్నలిస్టులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని ... వచ్చే నెలలో వీరందరికీ ఆర్థిక సహాయం అందజేస్తామని ఆయన ప్రకటించారు.

# వరదలపై కేంద్రానికి అందని నివేదిక

**కొనసాగుతున్న కేంద్ర బృందం పర్యటన**

**రోడ్ల మరమ్మత్తుకు తక్షణం 202.00 కోట్లు విడుదల**

**కేంద్రమంత్రి గడ్కరీకి కృతజ్ఞతలు చెప్పిన కిషన్ రెడ్డి**

హైదరాబాద్,అక్టోబర్23(ఆర్ఎన్ఎ): రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకు వరదనివేదిక తయారు చేసి కేంద్రానికి ఇవ్వలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నివేదిక ఆధారంగా త్వరగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. శుక్రవారం కూడా మంత్రి పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల బాధలను తెలుసుకున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో విస్తారంగా కురిసిన వర్షాలు, వరదల కారణంగా జరిగిన అపార నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రం ఒక బృందాన్ని తెలంగాణకు పంపించిన విషయం తెలిసిందే. ఈ బృందం ఇప్పటికే రాష్ట్రంలో పర్యటిస్తోంది. దిల్‌కుష్ గెస్ట్ హౌస్‌లో కేంద్ర బృందంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. వరద నష్టం నివేదిక త్వరగా కేంద్రానికి ఇవ్వాలని కేంద్ర బృందానికి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రం నుంచి సమగ్ర నివేదిక అందలేదని కేంద్ర బృందం వెల్లడించింది. నివేదిక ఆధారంగా ఆర్థిక సహాయంపై కేంద్ర నిర్ణయం నిర్ణయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అప్పటి వరకు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న... 75 శాతం కేంద్ర నిధులు వాడుకోవాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ఇదిలావుంటే తెలంగాణ రాష్ట్రంలో 868 కి.మీ పొడవు మేర ఉన్న 8 జాతీయ రహదారుల నిర్వహణ, మరమ్మత్తుల కోసం 202.00 కోట్ల అంచనాలను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదించింది. దీంతో సుదీర్ఘ కాలంలో పెండింగ్‌లో ఉన్న ఈ నిధులను విడుదల చేసినందుకు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రతిపాదనల గురించి పలు దఫాలుగా కిషన్ రెడ్డి కేంద్ర రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. గడ్కరీతో శ్రీ కిషన్ రెడ్డి సమీక్షించిన అనంతరం ఈ నిధుల విడుదలకు నితిన్ గడ్కరీ అంగీకరించారు. అయితే ఈ విడుదల చేసిన మొత్తం నిధులు ఆర్అండ్‌బి సమర్పించిన ప్రతిపాదనలకంటే 85 శాతం ఎక్కువ ఉండడం గమనార్హం. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు మరింత పాడవ కుండా, కొత్త గుంతలు ఏర్పడకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షితంగా వాహనాలు నడిపేందుకు వీలుగా రోడ్లను బాగుచేసేందుకు ఈ నిధులను సద్వినియోగపరుచుకోవచ్చని భావిస్తున్నారు. వరదలు, భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు బాగా దెబ్బతిన్న సమయంలో ఈ నిధులు వస్తుండటం శుభపరిణామని చెబుతున్నారు.

## రెండు అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం

విజయవాడ,అక్టోబర్24 (ఆర్ఎన్ఎ):ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25న నిజ ఆశ్వయుజ శుద్ధ నవమి ఆదివారంనాడు విజయదశమి రోజున అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనంతో దసరా ఉత్సవాలు ముగియనున్నాయి. అదే రోజున సాయంత్రం 5గంటలకు పరమపావనీ అయిన కృష్ణవేణమ్మ ఒడిలో ఇంద్రకీలాద్రి అధిష్టాన దేవత అయిన కనకదుర్గమ్మకు హంస వాహన సేవ జరగనుంది.

అమ్మవారు కృష్ణానదిలో జల విహారం చేయనున్నారు. తెప్పోత్సవంగా పిలిచే ఈ హంసవాహన సేవలో త్రిలోక సంచారానికి గుర్తుగా శ్రీ గంగా, పార్వతీ (దుర్గ) సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లను మూడుసార్లుగా ప్రదక్షిణలతో కృష్ణానదిలో జలవిహారం చేయిస్తారు.

ఈ ఏడాది నవరాత్రులు 9రోజులు పాటు నిర్వహిస్తుండటంతో ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ రెండు అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఉదయం 5నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8గంటల వరకు మహిషాసుర మర్ధని అలంకారంలో దర్శనమిస్తారు. భక్తులను కటాక్షించనున్నారు. దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపం దుర్గాదేవి దుర్గముడనే రాక్షసుడిని సంహరించినందున దుర్గ అని పేరొచ్చింది.

దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపంగా భక్తులు దుర్గాదేవిని కొలుస్తారు. ఎరుపు రంగు చీరలో త్రిశూలం చేతపట్టుకుని కోటి సూర్యప్రభలతో వెలుగొందే ఈ అమ్మవారిని ఎర్రటి పుష్పాలతో పూజిస్తే శత్రు బాధలు నశిస్తాయి. ఈ రోజున అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గారెలు, కదంబం (కూరగాయలు, అన్నం కలిపి వండేది) బెల్లం, పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ రోజున భక్తులు దుర్గాష్టమిగా కూడా జరుపుకుంటారు.

ఇక మహిషాసురమర్ధనీ దేవి. నవదుర్గల్లో ఇదే అత్యుగ్రరూపం. శరన్నవరాత్రుల్లో భాగంగా 8వ రోజైన నిజ ఆశ్వయుజ శుద్ధ నవమి పురస్కరించుకుని శనివారంనాడు మధ్యాహ్నం 2గంటలు నుంచి రాత్రి 8గంటల వరకు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ శ్రీ మహిషాసురమర్ధనీ దేవిగా దర్శనమిస్తుంది. అష్ట భుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే. అందుకే ఇది నవదుర్గల్లో అత్యుగ్రరూపం. ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించిన మహాశక్తిగా భక్తులను సాక్షాత్కరిస్తుంది. ఈ తల్లికి గారెలు, బెల్లంతో కలిపిన అన్నాన్ని నైవేద్యంగా నివేదిస్తారు.

# పోలవరం బాధ్యత కేంద్రానిదే

**చంద్రబాబు నిర్వాకం వల్ల ఎపికి అన్యాయం జరిగింది**

**కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో బుగ్గన భేటీ**

**నిధులు విడుదల చేయాలని వినతి**

న్యూఢిల్లీ,అక్టోబర్23(ఆర్ఎన్ఎ): ఆంధ్రుల జలజీవ నాడిగా తెరపైకి వచ్చిన పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం షాక్ ఇచ్చిన విషయం విదితమే. జాతీయ ప్రాజెక్టు హోదా ఉన్న పోలవరం అంచనా వ్యయాన్ని... 2013-14లో పేర్కొన్నట్లుగా రూ.20,398.61 కోట్లకే పరిమితం చేసింది. 2013లో వచ్చిన కొత్త భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం పరిహారం ఖర్చు భారీగా పెరగడంతో... ప్రాజెక్టు తుది అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లకు చేరుకుంది. ఈ విషయమై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమావేశమయ్యారు. సుమారు అరగంటకు పైగా పోలవరం నిధుల విషయమై నిశితంగా చర్చించారు. అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన బుగ్గన.. పోలవరాన్ని పూర్తిగా తామే నిర్మిస్తామని విభజన చట్టంలో కేంద్రం చెప్పిందన్న విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామన్నారు. 'పునరావాసం, భూసేకరణ ఖర్చు కేంద్రానిదే అని చట్టంలో ఉంది. కేంద్రం చేపట్టాల్సిన ప్రాజెక్టును 2014లో రాష్ట్రం తీసుకుంది. 2014 నాటి ఖర్చు ఇవ్వాలని గత ప్రభుత్వం తీర్మానం చేసింది. పోలవరం ఖర్చును పరిమితం చేయాలని చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. పోలవరం విషయంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. పోలవరం కాంట్రాక్టు పనులపైనే టీడీపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది' అని బుగ్గన వెల్లడించారు. పోలవరం విషయంలో చంద్రబాబు తప్పుల వల్ల రాష్ట్రానికి అన్యాయం జరిగింది. 2016లో ప్రత్యేక ప్యాకేజీ పేరుతో 2014 నాటి ఖర్చులకు.. చంద్రబాబు ప్రభుత్వం పోలవరం ఒప్పందం చేసుకుంది. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మిడ్‌నైట్ డీల్ కుదుర్చుకుంది. ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా 2014 నాటి ఖర్చులు ఇస్తే సరిపోతుందన్నారు. పునరావాసం, భూసేకరణ ఖర్చు, ప్రాజెక్ట్ నిర్మాణం ఖర్చు పెరిగే అవకాశం ఉందన్న కేబినెట్ తీర్మానం కూడా పక్కన పెట్టారు. ఈ అంశాన్ని గతంలోనే వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ప్రశ్నించారు. నాడు పట్టిసీమ పేరుతో పోలవరం ప్రాజెక్టు ఏడాదిన్నర ఆలస్యం చేశారు. కేంద్ర ప్రభుత్వమే నిర్మాణం చేపడితే కాంట్రాక్టులు దక్కవని చంద్రబాబు ప్రభుత్వం ఇలా ప్రవర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును సీడబ్ల్యూసీ ద్వారా కన్ఫర్మ్ చేయాలని చంద్రబాబు ప్రధానికి లేఖ రాశారు. బాబు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు . పోలవరం కట్టాలనే ఆలోచన టీడీపీకి లేదు.. కాంట్రాక్టుల కోసమే ఇలాంటి ఒప్పందాలు చేసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వం సొంత కాంట్రాక్టుల కోసం సంవత్సరన్నర కాలం పాటు పోలవరాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. గత టీడీపీ పాలన వల్ల రాష్ట్రం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. 2016వ సంవత్సరంలో 2014 ఖర్చుకు పరిమితం కావాలని ఒప్పుకోవడం సరికాదు. మా ప్రభుత్వంలో పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంచనాలు రివైజ్డ్ చేస్తున్న సమయంలో టీడీపీ ప్రభుత్వ బండారం బయటపడింది. పోలవరం ఇప్పటికీ జాతీయ ప్రాజెక్టుగానే పరిగణిస్తున్నాం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఎగ్జిక్యూటివ్ అథారిటీ మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులను కండిషన్స్ లేకుండా రీయింబర్స్ చేసి త్వరితగతిన విడుదల చేయాలి. భూసేకరణ, పునరావాసం తదితర అంశాలను వేరుగా చూడాలి. ఈ సమస్యకు తగిన మార్గం చూపించాలి. ప్రాజెక్టు నిర్మాణం ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది' అని బుగ్గన మీడియాకు వెల్లడించారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**హైమాస్ట్ లైట్స్ లను ప్రారంభించిన ఎంపీపీ ,జెడ్ పి టి సి**

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 24 (నేటినిజం ప్రతినిధి):మారుపాక,చందరగిరి గ్రామంలో మండల్ పరిషత్ నిధులతో ఏర్పాటుచేసి హైమాస్ లైట్లను గ్రామ సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ ఆధ్వర్యంలో వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు , జెడ్ పి టి సి మ్యాకల రవి శనివారం ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని , స్మశాన వాటికలు, కంపోస్టు షెడ్డు, హరితహారం ,పల్లె ప్రకృతి వనాలు ,రైతు వేదికలతో ఇలా పల్లెలో అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి అన్నారు . అర్బన్ మండలంఆడపడుచులకు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు,ప్రజాప్రతినిధులకు ,మండల అధికారులకు , మండల దికారులకు సద్దుల బతుకమ్మ, దసరా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు, అలాగే కరోన ప్రభావం ఎక్కువగా ఉ



న్నందున ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటిస్తూ మాస్క్ ధరించి ఎవరి జాగ్రత్తలు వారు తీసుకొని ఎవ్వరికి హాని కలుగానివ్వకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ,ఉప సర్పంచ్ తుమ్మల శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు జి. సత్తయ్య, వార్డు సభ్యులు జి . పర్శరాములు, వ్యవసాయ కమిటీ గ్రామ శాఖ అధ్యక్షులు పి.అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రుద్రవరంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 24 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉరడి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 4 హైమాస్ లైట్లను వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, జెడ్ పి టి సి మ్యాకల రవి ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెలు పచ్చగా పరిశుభ్రంగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ గా ఆవిర్భవిస్తుందని అన్నారు .సద్దుల బతుకమ్మ దసరా పర్వదిన శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు .ప్రజలందరూ భౌతిక దూరం పాటిస్తూ ,మాస్కులు ధరించి వేడుకలు జరుపుకోవాలని వారు కోరారు .గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినందుకు పాలక వర్గానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి ,ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరడి ప్రవీణ్ , వార్డ్ సభ్యులు బెజగం మహేష్ , తునికి నర్సయ్య ,తునికి కనుకరాజు, అనుముల కావ్య భరత్ గారు, నడిగొట్ల స్వప్న హరికృష్ణ , అతికం పావని కనుకయ్య ,కట్ట లక్ష్మీ దేవయ్య ,సహకార సంఘం డైరెక్టర్ వంకాల రాజు, కట్ట ఎల్లయ్య , కట్ట శ్రీనివాస్ మాజీ సర్పంచ్ లు పిల్లి రేణుక కనకయ్య , మాజీ ఎంపీటీసీ అలువాల కవిత పర్శరాం ,టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉరడి రాజిరెడ్డి , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కత్తి కనకయ్య , గుండెల్లి రాజు ,కట్ట తిరుపతి , గుండెల్లి శ్రీనివాస్ , సంతపురి మహేందర్ రెడ్డి , గ్రామ పెద్దలు, యువత,ప్రజలు పాల్గొన్నారు.

# అధ్యక్షుడికి తమ్ముళ్ల స్వాగతం



రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 24 (నేటినిజం ప్రతినిధి):టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ మంత్రి ఎల్ రమణ కు ఆ పార్టీ తమ్ముళు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి ప్రాబల్యాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెంచేందుకు ఆయన శనివారం హైదరాబాద్ నుండి వేములవాడ పట్టణానికి విచ్చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్ రమణ రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వేములవాడ పట్టణానికి చెందిన టిడిపి కరీంనగర్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులి రాంబాబు, సీనియర్ నాయకులు ముప్పిడి శ్రీధర్, నందిపేట వెంకటరమణ, చిట్టి,మంజు మహేందర్ తదితరులు రమణ కు పుష్పగుచ్చం ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# పేదవాడి ఆకలి తీర్చడం కొందరికే సాధ్యం

**ఐ ఆర్ ఈ సి కి అభినందనల వెల్లువ**

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 24 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ 5 వ వార్డులోని 200 నిరుపేద కుటుంబాలకు ఇండియన్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ వారు కే ఐ ఏ ఎఫ్ అకాడమీ సహకారంతో నిత్యావసర సరుకులు, సన్నబియ్యం, మాస్కులు మరియు శానిటైజర్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ జడల లక్ష్మి శ్రీనివాస్ యాదవ్, ఇస్లాం నగర్ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇంఛార్జి మొహమ్మద్ అఫ్జల్ బియాబాని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నిరుపేదలకు తమ సంస్థ నిత్యావసరాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , సెస్ డైరెక్టర్ జడల శ్రీనివాస్, 17 వ వార్డ్ కౌన్సిలర్ వంగల దివ్య శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జడల లక్ష్మి మాట్లాడుతూ తన వార్డ్ ప్రజలు చాలా మంది నిరుపేదలు ఉన్నారని వారి ఆకలి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని, ఇలాంటి మంచి పనులు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ మాట్లాడుతూ కులమతాలకు



అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించి , నిరుపేదలకు దసరా కానుకలు ఇచ్చినందుకు సంస్థకు ధన్యవాదములు తెలిపారు. ఇస్లాం నగర్ మజీద్ కమిటీ చైర్మన్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ తమ వార్డ్ ప్రజలకు దసరా కానుకలు అందించిన ఆ సంస్థ కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ ఈ సి సంస్థ వైస్ ఇంఛార్జి మిరాజ్ మిర్జా,షేక్ రబ్బానీ,రయ్యాన్ ఫరూక్, ఇస్లాం నగర్ మాజిద్ కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహ్మాన్, కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.